ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 13 ఏప్రిల్ 2024 | 5

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.0	24.0

హైస్కూల్ ప్లస్‌కు..మళ్లీ నిరాశే

- ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఐదో స్థానంలో తూర్పు
- గతేడాదికంటే మెరుగుపడిన ఉత్తీర్ణత శాతం
- సీనియర్ ఇంటర్‌లో పైచేయి సాధించిన బాలురు
- రెగ్యులర్ జూనియర్ 75..సీనియర్ 83 శాతం
- హైస్కూల్ ప్లస్ జూనియర్ 26.. సీనియర్ 36 శాతం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో తూర్పుగోదావరి రాష్ట్ర స్థాయిలో మూడు స్థానాలు మెరుగుపడి ఐదో స్థానంలో నిలిచింది. వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకొచ్చిన 'హైస్కూల్ ప్లస్' మళ్లీ తుస్సుమనిపించింది. జిల్లాలో మొదటి ఏడాది 19039 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 14357 మంది 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాది 15394 మంది పరీక్షలు రాయగా 12837 మంది విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి ఏడాది 9278 మంది బాలలకు 6975 మంది 75 శాతం,9761 బాలికలకు 7382 మంది 76 శాతం మంది, రెండో ఏడాది 7409 మంది బాలలకు 6212 మంది 84 శాతం, 7985 మంది బాలికలకు 6625 మంది 83 శాతం ఉత్తీర్ణత సాధిం చారు. హైస్కూల్ ప్లస్‌లో మొదటి ఏడాది 26 శాతం, రెండో ఏడాది 36 శాతం మంది విద్యార్థులు మాత్రమే పాసయ్యారు.ఈ నెల 18 నుంచి 24 వరకూ రీకౌంటింగ్, రీవెరిఫికేషన్, సప్లి మెంటరీ, ఇంప్రూవ్ మెంట్‌కి దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్ఐవో ఎన్ఎస్ వీఎల్ నరసింహం తెలిపారు. సప్లిమెంటరీ, ఇంప్రూవ్ మెంట్ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1 వ తేదీ వరకూ నిర్వహిస్తారన్నారు. సమష్టి కృషి, విద్యార్థుల శ్రమ మంచి ఫలితాలు సాధించడానికి దోహదపడ్డాయన్నారు. ఉత్తీర్ణత సాధించని విద్యా ర్థులు నిరాశకు గురికావొద్దని సూచించారు.

రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్స్



ఎం.భాను (బైపీసీ 939) | ఎ.లావణ్య (ఎంఎల్టీ 974) | ఎం.మోహన కృష్ణ (సీఈసీ 915) | జి.గీత (ఎంపీహెచ్‌డబ్ల్యు 965)

పురందేశ్వరి గృహ ప్రవేశం

రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులో నివాసం





గృహం ప్రవేశం చేస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు

అదే ఇంటిలో యాగం చేస్తున్న దంపతులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 12 : రాజమహేంద్రవరం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం గృహ ప్రవేశం చేశారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులో ఉన్న ఇంటిలో శుక్రవారం దిగారు. నూతన గృహ ప్రవేశం సందర్భంగా దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు యాగం నిర్వహించారు.గతంలో పాత ఎస్పీ కార్యాలయం ఎదురుగా రాజమహేంద్ర వరం పార్లమెంట్ బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభించారు. అంతా అక్కడి నుంచే పురందేశ్వరి కార్యక్రమాలు చేస్తారని అనుకున్నారు. అయితే అనూహ్యంగా ఆమె ఒక ఇంటిని కూడా తీసుకున్నారు. పార్టీ కార్యాలయానికి చాలా దగ్గరగానే ఇల్లు తీసుకు న్నా రు.ఈ గృహ ప్రవేశానికి కుటుంబీకులు, ముఖ్యమైన బంధువులు మాత్రమే హాజర య్యారు. గృహప్రవేశం అనంతరం అదే ఇంటిలో దగ్గుబాటి దంపతులు ప్రత్యేకంగా యాగం కూడా చేయించారు. ఈ సందర్భంగా రాజమహేంద్ర వరంతో తమకున్న అనుబంధాన్ని కుటుంబీకులు గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

గొంతెండిపోతోంది!

నాయకులు చెప్పేవన్నీ వట్టి గాలిమాటలే.. ఎన్నికల సమయంలో అంతలేదు.. ఇంతలేదంటారు.. తీరా చూస్తే ఏళ్ల తరబడి ఉన్న సమస్య అయినా మళ్లీ ఐదేళ్లకు కానీ కంటికి కనపడదు.. చెవులకు వినపడదు..!? గత ఎన్నికల సమయంలో ఇంటింటికీ గోదావరినీరు హామీని వైసీపీ ప్రభుత్వం తెరపైకి తెచ్చింది.. సుమారు రూ.4 వేల కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.. ఐదేళ్లు గడచిపోయింది.. మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి.. ఇంటింటికీ గోదావరి నీరు పథకం గాలిలోనే ఉంది.. పథకం మాటెలా ఉన్నా నేటికీ గోదావరి చెంతనే గొంతెండిపోతోంది.. ఎక్కడో మారుమూల కాదు సుమా ఇటు రాజమహేంద్రవరం అటు కొవ్వూరు.. నిడదవోలు పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి.. జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లోనూ ఇంతే. వేసవి వచ్చిందంటే మంచినీళ్లకు కటకటలాడిపోతున్నారు.. ఎదురుగా కొన్ని లక్షల క్యూసెక్కుల నీరు ఉన్నా గొంతు తడారిపోతూనే ఉంది.. పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా పరిణమించింది.



- గోదారి చెంతనే ఉన్నా.. గొంతు తడవదు
- పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలక్ష్యం
- కలెక్టర్ ఆదేశాలు భేఖాతర్
- హుకుంపేటలో ఆరునెలలుగా ఇక్కట్లు
- సీతానగరంలో నిలిచిన కుళాయి పనులు
- ఐదేళ్లగా అతీగతీలేని పురుషోత్తపల్లి ఎత్తిపోతల

హుకుంపేటలో కట్‌కట!



రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 12 : గోదావరికి ఆమడ దూరం.. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామం.. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం రూరల్ లోని ఒక ప్రాంతం.. కలెక్టరేట్‌కి కూత వేటు దూరం.. అయినా నేటికీ మంచినీటి కుళాయిలు రాక ప్రజలుకటకటలాడిపోతున్నారు.. అయినా పట్టించుకునే వారే లేరు.. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు చేపట్టాలంటూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా పంచాయతీ అధికారులుగాని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గాని తగు చర్యలు తీసుకోవడం లేదంటు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధి హుకుంపేట పంచాయతీ పరిధిలో గల రామకృష్ణ నగర్, ఆదర్శనగర్, నాగిరెడ్డినగర్,సావిత్రినగర్, శ్యామలానగర్ తదితర ప్రాంతాల్లో గత 6 నెలలుగా గోదావరి మంచినీటి కుళాయిల ద్వారా మంచినీరు రావడం లేదు. దీంతో ప్రజలు మంచినీటికి కటకటలాడిపోతున్నారు. 1996లో ఆ ప్రాంత జనాభా ప్రాతిపదికన 90 వేల సామర్థ్యంగల నీళ్ళ ట్యాంకు నిర్మించారు. ప్రస్తుత జనాభా సుమారు 5500 నుంచి 6000 మంది వరకు నివాసం ఉంటున్నారు. ముఖ్యంగా రిటైర్డ్ అయిన ఉద్యోగులు ఎక్కువగా వుంటున్నారు. ప్రజాప్రతినిధులు వచ్చి వెళుతున్నారే తప్ప తమ సమస్యలను పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. పంచాయతి అధికారులకు ఎన్ని మార్లు విన్నవించుకున్నా శాశ్వత పరిష్కారం లేదని చెబుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు హుకుంపేట గ్రామానికి ప్రత్యేకాధికారిగా ఉన్నారు.అయినా ఏ రోజు గ్రామంలో పర్యటించిన పాపాన పోలేదని దీంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ ప్రాంతంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ట్యాంకుల శుభ్రత గాలికి..

కోరుకొండ, ఏప్రిల్ 12 : అధికారులు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని చెబుతుంటారు.. అయితే మంచినీటి ట్యాంకుల శుభ్రతను మాత్రం మర్చిపోతారు. కోరుకొండ మండలంలో అనేక గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. ప్రతి 15 రోజులకొకసారి మంచినీటి ట్యాంకులు శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లాల్సి ఉంది. కానీ ఎక్కడా మంచినీటి ట్యాం కులు శుభ్రపరచిన సంఘటనలు లేవు.ప్రతి గ్రామంలోను మంచినీటి సరఫరాకు నాలుగైదు జీఎస్ఆర్ ట్యాంకులు నిర్మించారు. వాటి చుట్టూ పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి మురుగు గుంటలుగా మారినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీని వల్ల మంచినీటి ట్యాంకుల వద్ద మురుగునీటితో కలుషితమవుతోంది. గ్రామాల్లో భగవాన్ సత్యసాయి మంచినీటి సరఫరాకు ప్రత్యేకంగా జీఎల్ఆర్ ట్యాంకులు నిర్మించారు. ట్యాంకుల వద్ద అపరిశుభ్రమైన వాతావరణం కనిపిస్తుంది. ట్యాంకుల వద్ద పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిధుల్లేక.. ఇంటింటికీ రాని కుళాయి



సీతానగరం,ఏప్రిల్ 12 : వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని గ్రామాల్లో ఇంటింటికి మంచినీటి కుళాయి ఇస్తామని చెప్పినప్పటికి ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. సీతానగరం మండలంలో రూ. 18.10 కోట్ల అం చనా వ్యయంతో ప్రారంభించిన పనులు నిధులు లేక నిలిచిపోయాయి. ఇంటింటికి మంచినీటి కుళాయి వస్తుందన్న ప్రజల ఆశ నిరాశగానే మిగిలింది. ఎక్కడ సమావేశం జరిగినా ఇంటింటికి కుళాయి ఇస్తామని నేతలు గత ఐదేళ్లగా పదేపదే చెబుతున్నారు. అయినప్పటికీ నిధులు విడుదల కక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.13 హేబిటేషన్లలో పనులు పూర్తయ్యాయని చెబుతున్నా మిగిలిన 19 హేబిటేషన్లలో పనులు జరగడం లేదు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్‌ను వివరణ కోరగా మండలంలోని 32 హేబిటేషన్లకు 13 హేబిటేషన్లలో పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. గత 3 నెలలుగా విడుదల కాలేదని తెలిపారు.

జగన్ పగ..నీరుగారిన లక్ష్యం!

- అసంపూర్తిగా నిలిచిపోయిన పురుషోత్తపల్లి ఎత్తిపోతల పథకం
- రూ.1638 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు నిరుపయోగం
- చంద్రబాబు హయాంలో ఆరంభం.. ఐదేళ్లుగా పట్టించుకోని జగన్
- పర్యావరణ అనుమతులు లేవని నిలిచిన పథకం

సీతానగరం, ఏప్రిల్ 12 :చంద్రబాబు లక్ష్యం ఘనం.. జగన్ నిర్లక్ష్యానికి నిలువుటద్దం..ఈ ప్రాజెక్టు.. నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మెట్ట ప్రాంత వాసుల సాగు, తాగునీరు అవసరాలను తీర్చడానికి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం చేపట్టారు. చాలా వరకూ పూర్తి చేశారు.అయితే పర్యావరణ అనుమతులు లేవనే కారణంతో ప్రాజెక్టును అడ్డుకున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్లయినా వేల కోట్లతో సాగు, తాగునీటి అవసరాల నిమిత్తం కట్టిన ప్రాజెక్టు నిరుపయో గంగా మార్చేశారు. ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎత్తిపోతల పథకం ప్రాధాన్యత నీరుగారిపోతోంది. 2017వ సంవత్సరంలో జలసిరి హారతి పథకంలో భాగంగా 28 ఇరిగేషన్ ప్రాజెక్టులను తెలుగుదేశం ప్రభుత్వం తలపెట్టింది వాటిలో పురుషోత్తపట్నం ఒకటి. ఇది 2.15 లక్షల ఎకరాల భూమికి.. విశాఖ వాసులకు తాగునీరందించాలన్న ఉద్దేశంతో రూపుదిద్దుకుంది. రాజానగరం, జగ్గంపేట ,పిఠాపురం , పెద్దాపురం, ప్రత్తిపాడు మండలాలకు పోలవరం కెనాల్ ద్వారా 20 వేల ఎకరాలకు, లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 67 వేల ఎకరాలకు వ్యవసాయ భూములకు నేరుగా సాగునీరందించేందుకు రూపకల్పన చేశారు. పోలవరం చానల్ ద్వారా ఏలేరు రిజర్వాయర్‌కు నీరు మళ్లించి అక్కడ నుంచి దగ్గరలోని చెరువుల్లోకి నీరు పంపుతారు. ఈ మేరకు 10 పంపులను పురుషోత్తపట్నం పంపింగ్ స్కీం వద్ద ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పంపు 350 టీఎంసీల నీటిని విడుదల చేసే సామర్థ్యంతో ఏర్పాటు చేసారు. 50 వేల ఎకరాల భూమికి 2 పార్టులుగా విభజించి ఒకటి 7 వేల ఎకరాలు.. మరొకటి 43 వేల ఎకరాలు మొత్తం 50 వేల ఎకరాలకు ఏలేరు రిజర్వాయరు ద్వారా సాగునీరందించాల్సి ఉంది.రూ.1638 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు. ఆగస్టు 15వ తేదీన ఫస్ట్ పేజ్‌లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు 2 పంపులను ప్రారంభించారు.అయితే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు లేవని ఎన్‌జీటీలో పిటిషన్ దాఖలు కావడంతో పంపింగ్ స్కీమ్‌ను నిలిపివేశారు. ఈ కేసును గతేడాది విచారించిన సుప్రీంకోర్టు రూ.2.48 కోట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలికి చెల్లించాలని ఆదేశించింది. నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయలేదు. ప్రభు త్వం నిర్లక్ష్యం చేయడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీంతో లక్షలాది మంది రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. విశాఖవాసుల గోదావరి నీటి కల తీరకుండా ఆగిపోయింది.



నిరుపయోగంగా పురుషోత్తపల్లి ఎత్తిపోతల పథకం

నేను రాజకీయాలకు దూరం : ఉండవల్లి



రాజమహేంద్రవరం, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి) : నేను ఏ పార్టీలోనూ లేను. రాజకీ యాలకు దూరంగా ఉన్నాను. ఓటు హక్కు మాత్రం వినియోగించుకుంటాను. కానీ నేను బీజేపీకి మాత్రం వ్యతిరేకమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం ధర్మంచర హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లా డారు. మార్గదర్శి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు సంతోషాన్ని కలిగించాయని, రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించవల సిందిగా తెలంగాణ హైకోర్టును ఆదేశించిందన్నారు. ఆరునెలల్లో విచారణ మొదలుకావొచ్చని, ఓ ఏడాదిలోపు పూర్తవుతుందని, డిపాజిట్లకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నానన్నారు.



పొట్టిలంకలో రూ.కోటి విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- మెయిన్‌లో

రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న వంటసామగ్రి

రైల్వే స్టేషన్‌లో వంట సామగ్రి స్వాధీనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజ మండ్రి రైల్వే స్టేషన్ పార్శిల్ కార్యాలయంలో సరైన పత్రాలు లేని వంట సామగ్రిని ప్రభుత్వ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ విజయ్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల తనిఖీల్లో భాగంగా జీఆర్పీ ఎస్ఐలు ఎం.మావుళ్ళ, పి.లోవరాజు తమ సిబ్బందితో పార్శిల్ కార్యాలయంలో తనిఖీలు చేయగా బెంగళూరు నుంచి వచ్చిన ఓ కన్‌సైన్‌మెంటులో నాన్‌స్టిక్ కుక్‌వేర్ గుర్తించడం జరిగిందన్నారు. సుమారు 84 వస్తువుల్లో 40 వస్తువులకే బిల్లులు ఉండడం,మిగతా వాటికి సరైన రశీదులు లేకపోవడంలో వాటిని స్వాధీనం చేసుకొని ఎన్నికల గ్రీవెన్స్ కమిటీకి అప్ప గించామని సీఐ తెలిపారు.డీఎస్ఆర్పీ ఎల్.మోహనరావు పర్యవేక్షణలో రాజమహేంద్ర వరం రైల్వే సబ్ డివిజన్ పరిధి రైల్వే స్టేషన్లలో పటిష్టమైన నిఘా పెట్టామని చెప్పారు.



ఈవీఎంల ర్యాండమైజేషన్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంల మొదటి రాండమైజేషన్ రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ ఆఫీసర్ సూచనలు మేరకు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారిణి ,కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం జిల్లా స్ట్రాంగ్ రూమ్ కమ్ వేర్‌హౌస్ గొడౌన్ లో ఈవీఎంల మొదటి రాండమైజేషన్ ప్రక్రియని స్వయంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు.జిల్లా ఆర్వో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఈ నెల 12,13 తేదీల్లో రాజమహేంద్రవరంలోని జిల్లా స్ట్రాంగ్ రూమ్ కమ్ వేర్ హౌస్ గోడౌన్‌లో ఈవీఎంల మొదటి రాండమైజేషన్ పనులు ప్రారంభించామన్నారు. ఇప్పటికే జిల్లాకు కేటాయించిన 5,971 బ్యాలెట్ యూనిట్స్ ,5,463 కంట్రోల్ యూనిట్స్ ,వీవీపాట్ యూనిట్స్ 4,927 లను సాంకేతికంగా తనిఖీ చేసి వాటి పని తీరును నిర్ధారణ చేసి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. ఒక్కో ఈవీఎం భద్రపరిచే బాక్స్‌లో 10 యూనిట్స్ ఉంటాయని తెలిపారు. ఒక్కో యూనిట్ ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం చొప్పున 7 నియోజకవర్గాలకు కేటాయించి.. సీరియల్ నెంబర్లను స్కానింగ్ చేస్తారన్నారు.పార్లమెంట్‌కి సంబంధించిన ఈవీఎం ర్యాండమైజేషన్ చేసి ఆయా నియోజకవర్గాలకు తరలించనున్నట్లు తెలిపారు. రాజ మహేంద్రవరం సిటీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను ఎస్‌కేవీటీలోని పైఅంతస్తులోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు.ఈ ప్రక్రియను ఆర్‌వో దినేష్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ ఆర్‌వో ఎన్.తేజ్‌భరత్,కొవ్వూరు ఆర్‌వో అశుతోష్ శ్రీవాత్సవ్ , డీఆర్‌వో జి.నరసింహం, రాజానగరం ఆర్‌వో ఏ చైత్రవర్షిణి, గోపాలపురం ఆర్‌వో కెఎవ్ శివజ్యోతి, అనపర్తి ఆర్‌వో ఎమ్.మాధురి, నిడదవోలు ఆర్‌వో ఆర్‌వి రమణా నాయక్, రాజమండ్రి పార్లమెంట్ ఆర్‌వో ఎస్‌డీసీ ఆర్ కృష్ణానాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భాను ప్రకాష్, పి.సువర్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు నలబాటి శ్యామ్, సిహెచ్ శ్రీనివాసరావు, సలాది ఆనంద్, జి వెంకటరావు, వీఎస్ శ్యామల పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

సీతానగరం/బిక్కవోలు/కోరుకొండ/ రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 12 : వలంటీర్లు రాజీనామాలు చేస్తూనే ఉన్నారు. దాదాపు అన్ని మండలాల్లోనూ రాజీనామాలు పెరిగాయి.సీతానగరం మండలంలో శుక్రవారం ఒక్కరోజే మొత్తం 63 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వలన రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా పత్రంలో పేర్కొన్నారని ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. బిక్కవోలు 4వ సచివాలయ వలంటీర్లు 16 మంది శుక్రవారం రాజీనామాలు చేసారు. వీటిని సచివాలయ కార్యదర్శి రోజాకు అందజేశారు. ఇదే బాటలో పలువురు వలంటీర్లు సోమవారం రాజీనామాలు చేయనున్నట్లు తెలిసింది. కోరుకొండ మండలంలో 6 గ్రామాలకు చెందిన 64 మంది వలం టీర్లు శుక్రవారం సామూహిక రాజీనామాలు చేశారు. వీరు తమ రాజీనామా పత్రాలను కోరుకొండ ఎంపీడీవో పి. కృష్ణమూర్తికి అందజేశారు. రాజీనామాలు సమర్పించిన వారిలో కణుపూరు, రాజవరం, బొల్లేద్దుపాలెం, గరగలంపాలెం, నిడిగట్ల గ్రామాలకు చెందిన వలంటీర్లు ఉన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిలో ఇప్పటి వరకు మొత్తం 114 మంది తమ రాజీనామా పత్రాలను రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావుకు అందజేశా రు. వీరిలో తొర్రేడు 3, శాటిలైట్ సిటీ 6, పిడింగొయ్యి 20, కోలమూరు 24, కాతేరు 8, హుకుంపేట 8, బొమ్మూరు 1, ధవళేశ్వరం 44 మంది వలంటీర్లు రాజీనామా సమర్పించిన వారిలో ఉన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ రాజీనామాలు దుమారం రేపుతున్నాయి.



సీతారాములు, కల్యాణానికి పందిరిరాట వేస్తున్న పండితులు అధికారులు

సీతారాములు, సత్యదేవుడి దివ్య కల్యాణాలకు పందిరిరాట

అన్నవరం, ఏప్రిల్ 12: రత్నగిరివాసుడైన సత్యదేవుడి దివ్యకల్యాణం, క్షేత్రపాలకుల సీతారాముల దివ్యకల్యాణోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం పందిరరాట శాస్త్రోక్తంగా వేశారు. చైత్రమాసంలో ఈనెల 16నుంచి 22వరకు కల్యాణోత్సవాలు జరుగనుండగా రాములోరి కల్యాణం 17న ఉదయం నిర్వహిస్తారు. సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల వార్షిక దివ్యకల్యాణోత్సవాలు మే 18 నుంచి ప్రారంభమై 24 వరకు జరుగుతాయి. సత్యదేవుడి దివ్యకల్యాణం మే 19 రాత్రికి వైభవంగా జరుగనుంది. ఈఏడాది రెండు కల్యాణాలకు ఒకేసారి పందిరిరాట ముహూర్తం రావడం విశేషం. కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఈవో రామచంద్రమోహన్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు

సామర్లకోటలో భక్తులకు ఉచిత వసతి సదుపాయాలు



ఉచిత వసతి సదుపాయాలు భక్తులకు కల్పించే కల్యాణ మండపం

సామర్లకోట, ఏప్రిల్ 12: కాకినాడజిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం సమీపాన 200 మీటర్ల దూరంలో మాండవ్యనారాయణ స్వామి ఆలయం వద్దగల కల్యాణ మండపంలో ఉచిత వసతి సదుపా యాలు భక్తులకు పూర్తి అందుబాటులో ఉంచినట్లు ఆలయ కార్యనిర్వహ ణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. ఈమేరకు శుక్రవారం విలేకరులతో ఈవో నీలకంఠం మాట్లాడుతూ ప్రతీరోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ సదుపాయాలు సుదూర ప్రాంతాల నుంచి భక్తుల అవసరార్థం ఏర్పాటుచేశామన్నారు. అలాగే భీమేశ్వరాలయం నూరుకాళ్ళ మండపంవద్ద దేవాలయ నిత్యాన్నదాన పథకంలో ఉచిత అన్నప్రసాద పథకం అమలులో ఉన్నందున భక్తులు ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించాలని ఈవో నీలకంఠం తెలిపారు.

పవన్ విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు

● పిఠాపురంలో హైపర్ ఆది ప్రచారం

పిఠాపురం/కొత్తపల్లి, ఏప్రిల్ 12: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గెలుపుని ఎన్ని కుతంత్రాలు చేసినా ఎవ్వరూ అడ్డుకోలేరని ఆ పార్టీ స్టార్ క్యాంపయినర్, సినీ నటుడు హైపర్ ఆది తెలిపారు. పిఠాపురం పట్టణంలోని 2,3వ వార్డుల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి పవన్‌ను గెలిపించాలని అభ్యర్థించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవన్ లక్ష మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని చెప్పారు. పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ పెట్టినప్పటి నుంచి సిద్ధాంతాలు నచ్చి ఆయనతో కలిసి అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఏ అధికారం లేకుండానే కౌలు రైతులు సహా ఎందరినో ఆదుకుంటున్నారని చెప్పారు. పవన్‌ను దత్తపుత్రుడు అంటూ కొందరు ఎగతాళి చేశారని, దత్తాత్రేయుడు ఆయన దత్తపుత్రుడిగా చేసుకుని పిఠాపురం నుంచి పోటీ చేయిస్తున్నారని తెలిపారు. అంతకు ముందు కోటగుమ్మం సెంటర్ వద్ద ఉన్న జైగణేష్ దేవస్థానం, అగ్రహారంలోని అనఘా దత్త క్షేత్రాల్లో పూజలు నిర్వహించారు. ప్రచారంలో జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ కుమార్, రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తనయుడు గిరీష్‌వర్మ, వీరమహిళల విభాగం ఉభయగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ చల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే హైపర్ ఆది కొత్తపల్లి మండలం వాకతిప్ప, కొత్తపల్లి, కొండెవరం గ్రామాల్లో స్థానిక నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. జనసేన, టీడీపీ నాయకులు గవర రాంబాబు, మత్సా అప్పాజీ, గుండ్ర జగ్గారావు, గుండా అప్పారావు, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.



పిఠాపురంలోని అనఘాదత్త క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న సినీ నటుడు హైపర్ ఆది

వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

రెండో దఫా సమీక్షలో కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ

ఆత్రేయపురం, ఏప్రిల్ 12: కోనసీమ తిరుమల వాడపల్లిలో ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు జరిగే శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో రెండో దఫా సమీక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 19న తీర్థం, రథోత్సవం, కల్యాణోత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్టీసీ, హెడ్‌వర్క్స్, హెల్త్, అగ్నిమాపక శాఖల అధికారులు ఉత్సవాలకు తీసుకున్న చర్యలను వివరించారు. వివిధ డిపోల నుంచి 20బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, 60 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు సీఐ రామ్‌కుమార్ తెలిపారు. ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్, డీఎల్డీవో రాజేశ్వరరావు, దేవదాయశాఖాధికారి మల్లేశ్వరరావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహసీల్దారు వెంకట్రామయ్య పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదికను ఇన్‌చార్జి ఆర్జేసీ టి.విజయరాజు, ఆర్డీవో సత్యనారాయణ, అధికారులతో కలిసి ఆర్డీవో పరిశీలించి ఏర్పాట్ల వివరాలు తెలుసుకున్నారు.



కల్యాణోత్సవాలపై సమీక్షిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

18న రావులపాలెంలో 'సిద్ధం' సభ

● సీఎం జగన్ హాజరు

రావులపాలెం, ఏప్రిల్ 12: రావులపాలెంలో ఈనెల 18న 'సిద్ధం' సభ నిర్వహించనున్నట్టు వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, ఎంపీ సుభాష్ చంద్రబోస్, మంత్రి విశ్వరూప్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం 'సిద్ధం' సభ పోస్టర్లను విడుదల చేశారు. 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రావులపాలెంలో జరిగే సభకు సీఎం జగన్ హాజరవుతారన్నారు. రాత్రి కాకినాడ చేరుకుంటారన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎంపీ చింతా అనురాధ, పలువురు నాయకులు పాల్గొన్నారు.



'సిద్ధం' సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇంటర్ ఫలితాలలో 'తిరుమల' ప్రతిభ



అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 12: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్టు విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470కి 466 మార్కులు 12 మంది విద్యార్థులు జె.శ్రీసాయి బృంద, బి.ఉమాశ్రీ, కె.హేమంత్, కె.ప్రజ్ఞ, సీహెచ్.పూజిత సాయి, ఎస్.కావ్యశ్రీ, జె.పద్మప్రియ, ఎం.దీపికా రాజకుమారి, ఎం.ఆయేషా సిద్ధిక్, ఎ.పద్మిని, కె.సాయి సృజన, బి.యశ్వంత్ లోవస్వామి సాధించారని, 464 పైన 191మంది, 460 పైన 732మంది, 450 పైన 1688 మంది సాధించి 98.85 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో 440కి 436 మార్కులు నలుగురు విద్యార్థులు ఎల్.ప్రవల్లిక, ఆర్.సుచి, పి.సాయి అవినాష్, ఎ.దివ్యమానస సాధించారని, 433 పైన 62 మంది, 430పైన 120 మంది, 400 పైన 348 సాధించి 99.06 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను కె.బేబీ జాగృతి 990 మార్కులు, ఎం.దేవీవైష్ణవి 990 మార్కులు, 15 మంది విద్యార్థులు 989 మార్కులు, 11 మంది 985 మార్కులు పైన, 384 మంది 980 మార్కులు పైన, 1465 మంది 950 మార్కులు పైన సాధించి 99.88 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను ఎస్.రాధాకృష్ణ 989, ఎం.టెస్సా ఫ్రాన్సిస్ 989, డి.నవీన్ తేజా 989, పి.జ్ఞానశ్రీ 989 మార్కులు సాధించారని తెలిపారు. 58మంది విద్యార్థులు 980 పైన, 125 మంది 970 పైన, 227 మంది 850 పైన మార్కులు సాధించి 99.30శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను శుక్రవారం పుష్పగుచ్ఛాలతో తిరుమలరావు అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 'ఆదిత్య' జయకేతనం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 12: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో యోగిత, సవిత, అంజలి, సుజిత, ఆశిష్‌సాయి, బిందుమాధురి, అనిరుద్ 470 మార్కులకుగానూ ఏడుగురు విద్యార్థులు 465 మార్కులు సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ స్థానాన్ని దక్కించుకున్నారన్నారు. అదేవిధంగా 20 మంది విద్యార్థులు 464 మంది సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో గీత సౌమ్య 1000 మార్కులకుగానూ 990, సైద్ షెహనాజ్ 989, ఐదుగురు విద్యార్థులు 988, ఎనిమిది మంది విద్యార్థులు 987 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440 మార్కులకుగానూ వెంకట లలిత 435, ఒకరు 434, ముగ్గురు 433, మరో ముగ్గురు 432 మార్కులను పొందినట్లు తెలిపారు. ఎంఈసీ జూనియర్ ఇంటర్లో ఫలితాల్లో మహేశ్వరి, అంజనాదేవి, సంతోషి 500 మార్కులకుగానూ 489, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో శేఖర్ సాత్విక 1000 మార్కులకుగానూ 978, సరయు 972 ఇద్దరు విద్యార్థులు 971 మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి, జూనియర్ కళాశాలల సమన్వయకర్త లక్ష్మీకుమార్ తదితరులు అభినందించారు.

'శ్రీ ప్రకాష్' విద్యార్థుల విజయభేరి



టి.వినీలా



డీడీ సాయి శ్రీనివాస్



లాస్యనందిని



సాయి నిహారికి



ఎస్ఐ మేఘన



జి.వర్షిణి

తునిరూరల్, ఏప్రిల్ 12: ఏపీ ఇంటర్ బోర్డు ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం నుంచి టి.వినీల 1000కి 982, డీడీ సాయి శ్రీనివాస్ 1000కి 980 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా బైపీసీ ద్వితీయ సంవత్సరం లో కె.లాస్యానందిని 1000కి 979 మార్కులతో అగ్రస్థానం, ఎంపీసీ ప్రథమం, డీవీఎల్ సాయి నిహారికి 470కి 464, ఎస్. మేఘన 470కి 463 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో జి.వర్షిణి 440కి 428మార్కులతో అగ్రస్థా నంలో నిలిచి ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

175 నియోజకవర్గాల్లోనూ బీఎస్పీ పోటీ

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: రాష్ట్రంలో బహుజనుల సమస్యలు రాజ్యాధికారం ద్వారానే పరిష్కారమవుతాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి అన్నారు. రాజమహేంద్రవరం గేదెల నూకరాజు కల్యాణ మండపంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమీక్షించారు. ఒక బీసీగాని, ఎస్సీ గాని ముఖ్యమంత్రి కావాలంటే అది బీఎస్పీ వల్లే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో బీఎస్పీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని చెప్పారు. తొలుత పూలే, కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు, రాజమహేంద్రవరం, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థులు పి.గణేశ్వరరావు, కే.నరసింహమూర్తి, నిడదవోలు,పి.గన్నవరం, అమలాపురం, రాజమహేంద్ర వరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులు గుమ్మాపు చిత్రసేను, కె.సత్యం, యాళ్ల దొరబాబు, కొండపల్లి సూరిబాబు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఎం మోషే తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

రుణాలు ఇప్పిస్తామని మోసం

● లక్షల్లో సొమ్ములు కోల్పోయామని బాధితుల ఫిర్యాదు

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 12: రుణాల పేరుతో మోసగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు బాధితులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన చిన్నం మణి, అన్నవరం, మంగం వసంత, లోడా పద్మ, బందిలి భవానీ, నాగలక్ష్మి, కుంచే సత్యవతి తదితరుల వద్దకు కాకినాడకు చెందిన పెదపాటి చిన్ని, జగ్గంపేటకు చెందిన పద్మలతో పాటు చేబ్రోలుకు చెందిన అన్నవరం అనే వ్యక్తి ద్వారా వచ్చి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని, రుణమాఫీ చేయిస్తామని నమ్మబలికారు. వీరి ఆధార్, రేషన్‌కార్డుల జిరాక్స్‌లు, ఫోటోలు తీసుకుని బ్యాంకు పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. రుణాలు మంజూరయ్యాయని చెప్పి రూ.50వేలు వంతున ఇచ్చారు. రుణ వాయిదాలను చిన్నికి చెలిస్తూ వచ్చారు. కొంతకాలం తర్వాత పిఠాపురం బ్యాంకు ఆఫ్ బరోడా సిబ్బంది వచ్చి మీరు రూ.2లక్షల వంతున రుణం తీసుకున్నారని, వాయిదాలు చెల్లించలేదని చెప్పారు. తక్షణం రుణాలు చెల్లించాలని సూచించారు. దీంతో తాము మోసపోయినట్లు తెలుసుకుని చిన్ని ప్రశ్నించగా తమను బెదిరించిందని బాధితులు తెలిపారు. తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. విచారణ అనంతరం పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

పిఠాపురం, ఏప్రిల్ 12: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ముగ్గురు మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, ఆరు వేల రూపాయలు జరిమానా విధిస్తూ పిఠాపురం ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.సుధారాణి తీర్పు చెప్పారు. పెదపూడికి చెందిన భక్తులు తలుపులమ్మలోవకు వెళ్లేందుకు ట్రాక్టర్‌పై బయలుదేరి పిఠాపురం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో గోపాల్‌బాబా ఆశ్రమం సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో బాలుడు సహా ముగ్గురు మరణించారు. దీనిపై అప్పటి సీఐ రాంబాబు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ తిమ్మాపురం గ్రామానికి చెందిన సలాది సత్తిబాబుకు వివిధ సెక్షన్ల కింద జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఏపీపీ ఆకుల నాగలీలా రోజా ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పెద్దిపాలెంలో తాటాకిల్లు దగ్ధం

● రూ.20లక్షలు ఆస్తినష్టం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 12: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో 3 పోర్షన్ల తాటాకిళ్లు దగ్ధమై రూ.20లక్షల ఆస్తినష్టం కలిగింది. దీంతో మూడు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. పెద్దిపాలెంకు చెందిన పక్కుర్తి అచ్చిరాజు, లోవరాజు, పక్కుర్తి మాణిక్యం కుటుంబాలకు చెందిన మూడుపోర్షన్ల తాటాకిళ్లు శుక్రవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బీరువాలో ఉన్న రూ.3లక్షల నగదు, 30బస్తాల ధాన్యం, 10కాసుల బంగారం కాలి బూడిదయ్యాయి. విలువైన ఫర్నీచర్ మంటలకు ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో 3 కుటుంబాల వారు సర్వం కోల్పోయి వీధిన పడ్డారు. ప్రమాద విషయం తెలిసి ప్రత్తిపాడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుని అడిగి తెలుసుకుని బాధితులను ఓదార్చి బియ్యం, నగదు అందజేశారు. పెద్దిపాలెంకు చెందిన కొందరు రూ.11వేలు బాధిత కుటుంబానికి సహాయం అందజేశారు.



పెద్దిపాలెంలో దగ్ధం అవుతున్న తాటాకిళ్లు



బీరువాలో కాలిపోయిన సామాన్లను పరిశీలిస్తున్న సత్యప్రభ

సామర్లకోటలో వాహన తనిఖీల్లో రూ.12.67 లక్షలు స్వాధీనం



సామర్లకోటలో వాహనాల తనిఖీలో పట్టుబడ్డ డబ్బు

సామర్లకోట, ఏప్రిల్ 12: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సామర్లకోట పట్టణంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం స్థానిక మఠం సెంటర్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎటువంటి ధ్రువ పత్రాలు, రసీదులు లేకపోవడంతో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.12 లక్షల 67వేల 611లను స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జాస్తి రామారావు తదితర పోలీసు అధికారులతో కలసి ఈ తనిఖీలు నిర్వహించా రు. పెద బ్రహ్మదేవం గ్రామానికి చెందిన సీహెచ్‌వీవీ సత్యనారాయణమూర్తి వద్ద రూ.5.39లక్షలు, అచ్చంపేటకు చెందిన ఎల్లా రాకేష్ వద్ద రూ.7లక్షల, 28 వేల 611లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాలను సీజ్ చేసి ట్రెజరీకి అప్పగించినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రామారావు చెప్పారు.

లాడ్జిలో ఉరి వేసుకుని యువకుడి మృతి



మృతి చెందిన అనిల్‌కుమార్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 12: రామచంద్రపురంలో సాయి దత్తా లాడ్జిలో పెమ్మనబోయిన అనిల్ కుమార్(25) ఉరి వేసుకుని మృతి చెందాడు. వేళంగి గ్రామానికి చెందిన అనిల్ గురువారం సాయంత్రం స్థానిక సాయిదత్తా లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. రూమ్‌లో అనిల్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లాడ్జి మేనేజరు మేకా శివప్రసాద్ బంధువులకు సమాచారం ఇచ్చారు. అనిల్ అన్న వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ కె.సురేష్‌బాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అనిల్‌కు తండ్రి లేడు, తల్లి వద్ద ఉంటున్నాడు. క్రికెట్ బెట్టింగ్స్‌కు బానిసై ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

లారీని ఢీకొని యువకుడి మృతి

● మరొకరికి గాయాలు



పెరవలి, ఏప్రిల్ 12: నిడదవోలు-నరసాపురం రోడ్డులో కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో అన్నవరప్పాడుకు చెందిన వసంతాడ మధు (20), నిడదవోలు మండలం కలవచర్లలో దగ్గరి బంధువైన ముప్పిడి నాగచరణ్‌తో కలిసి అన్నవరప్పాడు వస్తుండగా మార్గమధ్యలో కానూరు వద్ద లారీని ఢీకొట్టారు. దీంతో మధు అక్కడికక్కడే మృతి చెందగా నాగచరణ్‌కు గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

కాజులూరు, ఏప్రిల్ 12: విద్యుదాఘాతంతో యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామానికి చెందిన యాళ్ళ మధుసునీల్ (19) స్థానిక గ్రామానికి చెందిన ఆక్వా రైతు మారెళ్ళ ఆదినారాయణ చెరువువద్ద జీతానికి పనిచేస్తున్నాడు. అయితే మధుసునీల్ చెరువులో చెత్త కోస్తుండగా ప్రమాదవశాత్తూ కొడవలికి కరెంటు వైరు తగిలి తెగిపోయింది. ఈ క్రమంలో కరెంటు వైరు తగిలి ప్రమాదం సంభవించి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీడనై నీవెంటే..

● ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల జోరు ● ఎన్నికల అధికారులపై కూడా నిఘా

● ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల వాహనాలకు సీసీ కెమెరాలు

● కలెక్టర్, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు అనుసంధానం

సామర్లకోట, ఏప్రిల్ 12: వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వారి ప్రచారాలు, డబ్బు, మద్యం సరఫరాపై ఎన్నికల అధికారులు నిఘా పెట్టారు. ఎన్నికల అధికారులపై సైతం నిఘా ఉంటోంది. ముఖ్యంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల తీరును 24 గంటలపాటు డేగ కన్నుతో పర్యవేక్షిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో, చెక్‌పోస్టులవద్ద తనిఖీల్లో ఎన్నికల అధికారులు సైతం ఎలాంటి పొరపొచ్చాలకు పోకుండా ఉండాలనే ఆలోచనతో వారి వాహనాలకు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. దీంతోపాటు వాటిని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తమ మొబైల్ ఫోన్‌లలో చూసుకునేలా జీపీఎస్ ట్యాగ్‌చేసి సీసీ కెమెరాల లైవ్‌ను అందిస్తున్నారు. దీంతో ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులు, డబ్బులు, మద్యం ఇతరత్రా పరిణామాలు ఏం జరిగినా ఉన్నతాధికారులు నీడనై వారి వెంటే ఉంటున్నారు. ఎన్నికల అధికారులను ప్రలోభపెట్టినా, ఎలక్షన్ కమీషన్ తీసుకున్న ఈ చర్యతో ఎవరు తప్పించుకునే అవకాశం లేకుండాపోయింది.

పనితీరు ఇలా..

పెద్దాపురం నియోజకవర్గంలో మొత్తం 9 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు షిఫ్టులుగా పనిచేస్తున్నారు. సామర్లకోట మండలం, పట్టణంలలో రెండు బృందాలు, పెద్దాపురం మండలం, పట్టణంలలో రెండు బృందాలను ఏర్పాటుచేశారు. ఈ బృందాలు 24 గంటలూ పనిచేస్తాయి. ఒక్కొక్క బృందం 8 గంటల పాటు షిఫ్టుగా పనిచేస్తాయి. వీరు తిరిగే వాహనంపై ప్రత్యేకంగా సీసీ కెమెరాను ఏర్పాటుచేశారు. సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి నిమిషాల వ్యవధిలో ఆ బృందం అక్కడికి వెళ్లి పరిశీలించే ప్రతీదీ సీసీ కెమెరాల్లో రికార్డుఅవుతుంది. దీనికి తోడుగా అసెంబ్లీ ఎన్నికలలో అభ్యర్థుల ప్రచారతీరును సైతం ఎన్నికల కమీషన్ డేగకన్నుతో గమనిస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, జన సమీకరణ, గొడవలు, అక్రమ రవాణా తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు అధునాతన పీటీజెడ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి 360 డిగ్రీల కోణంలో తిరుగుతూ సుమారు 50 మీటర్ల దూరం వరకూ సన్నివేశాలను, ఆయా పార్టీల ప్రచారాలను రికార్డు చేస్తాయి.



వాహనాలు తనిఖీలు చేసే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం

కలెక్టర్, రిటర్నింగ్ కార్యాలయాలకు అనుసంధానం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ఎంపీడీవో, మున్సిపల్ కమీషనర్ స్థాయిలో పనిచేస్తున్న అధికారులను నియమించారు. ఈ బృందాలు షిఫ్టుల ప్రకారం పనిచేస్తున్నాయి. ఈనెల ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారి వాహనాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎక్కడా చిన్నతప్పు జరగకుండా ఎన్నికల కమీషన్ పకడ్బందీగా ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారెవరైనా తప్పించుకోలేరు. ఈ కెమెరాలు కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేసి ఉంటాయి.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పన్నుల వసూళ్లకు నేడు, రేపు కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: పన్నుల చెల్లింపులకు శనివారం, ఆదివారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు రెండు వాయిదాలు కలిపి ఒకే దఫాలో 5 శాతం రాయితీతో చెల్లించే సౌకర్యార్థం కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక కౌంటర్లలో ప్రజలు పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

ఈవీఎం, వీవీ ప్యాడ్లపై శిక్షణ పూర్తిస్థాయిలో ఉండాలి

● సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్


మాట్లాడుతున్న సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, ఏప్రిల్ 12: త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలకు ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందాలని సబ్‌కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో పీవో, ఏపీవోలకు ఈవీఎం, వీవీ ప్యాడ్లపై అవగాహన, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టరు మాట్లాడుతూ రంపచోడవరం నియోజవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలకుగాను 59మంది సెక్టారు, 73 మంది రూట్ అధికారులను నియ మించ నున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో తగాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఎ.కృష్ణజ్యోతి, ఏవీరమణ, డి.వి.స త్యనారాయణ, టీడీలు ఎస్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, చైతన్య, బాలాజీ, శివ, శ్రీధర్, విశ్వనాథం, స్వామి, జి.సత్యనారాయణ, వీరభద్రరావు, సరిత, ఆర్ఐ ఎస్. విగ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరాబాయ్, లక్ష్మణ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన సదస్సు

మోతుగూడెం, ఏప్రిల్ 12: ఎస్పీ శ్రీ తూహిన్‌సిన్హా, రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వరరెడ్డి, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహూల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాలతో డొంకరాయి ఎస్ఐ శివకుమార్, తన సిబ్బందితో వై.రామవరం మండలం బొడ్డగండి గ్రామ పంచాయతీలోని రాజూ క్యాంప్ గ్రామంలో వచ్చే సార్వత్రిక ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో డొంకరాయి ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్నికల కోడ్‌ను అనుసరించాలని, కోడ్ అతిక్రమించిన వారిపై కేసులు నమోదు అవుతాయని తెలిపారు. అనంతరం రాజూ క్యాంపు గ్రామ యువతకు, డొంకరాయి ఎస్ఐ శివకుమార్, వాలీబాల్ కిట్ అందించారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ పోషయ్య, కన్నప్ప రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల విద్యార్థినుల ప్రతిభ

వై.రామవరం, ఏప్రిల్ 12 : వై.రామవరం మండలం పి.యర్రగొండ ఏపీటీ రెసిడెన్షియల్ గురుకుల కళాశాలలోని గిరిజన విద్యార్థినులు పరీక్షా ఫలితాల్లో ప్రతిభను కనబరిచారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో కె.హరిచందన సాయిప్రియ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిందని విద్యార్థినికి 470 మార్కులకు 456 మార్కులు వచ్చినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ తెలిపారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో కె.విష్ణుదుర్గాదేవి 440కి 406 మార్కులు వచ్చాయన్నారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ గ్రూపులో ఆర్.శృతిభార్గవి 954 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందన్నారు. ఎస్.మహా లక్ష్మి 928 మార్కులతో ద్వితీయ శ్రేణి సాధించిందని ఎంపీసీ గ్రూపులో ఎస్.మహాలక్ష్మి 801 సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 67శాతం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత లభించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వై.రామవరం జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 155 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 13మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 42మ ంది హాజరుకాగా 15 మంది మాత్రమే ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరకృప తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రశాంతికి మొదటి స్థానం



దేవీపట్నం, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ ఫలితాల్లో దేవీపట్నం మండలం ఇందుకూరుపేట జూనియర్ కాలేజీ ఎంపీసీ గ్రూపునకు చెందిన గొర్రెపూడి లక్ష్మీప్రశాంతి 938 మార్కులతో మండలస్థాయిలో మొదటిస్థానం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థి లక్ష్మీప్రశాంతిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

అడవిలో కార్చిచ్చు


కొండరాయి పరిధిలోని కెనాల్ కొండపైన కార్చిచ్చుతో దగ్ధమవుతున్న అడవి

మోతుగూడెం, ఏప్రిల్ 12: వై. రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పరిధిలోని కెనాల్ కొండపైన, గిరిజన స్టోర్ వెనుకభాగం, కొండపైన అడవికి నిప్పంటుకుని కాలిపోతుంది. అడవిలో ఆకులు రాలిపోయి మంటలు వ్యాపిస్తూ చాలావరకు అడవి కాలిపోతుంది. అడవికి నిప్పంటుకోవడంతో దట్టమైన పొగ వ్యాపిస్తోంది. దీంతో డొంకరాయి చుట్టుప్రక్క గ్రామ ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. అసలే ఎండ వేడి ఎక్కువగా ఉంది. ఈ సమయంలో అడవికి నిప్పంటుకోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు సతమతమవుతున్నారు. అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డొంకరాయి గ్రామస్థులు కోరుతున్నారు.

'పరిహారం ఇప్పించండి'

చింతూరు, ఏప్రిల్ 12 : జాతీయ రహదారి నిర్మాణం కారణంగా నష్టపోతున్న తమకు పరిహారం ఇప్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని కుయుగూరు బాధితులు ఐటీడీఏ పీవోకు తమ గోడును చెప్పుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఏపీ ఒడిస్సా అనుసంధాన రహదారి నిర్మాణం తమ సాగు భూములు మీదుగా సాగుతుందన్నారు. దీంతో తాము భూములు కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. పోలవరం ముంపులో ఉన్న గ్రామానికి చెందిన సాగు భూములకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎకరాకు అదనంగా రూ.5 లక్షల పరిహారం అంజేస్తామన్న హామీ నెరవేర్చలేదని, చివరకు ఆర్అండ్ఆర్ పరిహారం కూడా ఇవ్వలేదని వారు వాపోయారు. అధికారులు తమకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పలువురు బాధితులు పాల్గొన్నారు.

రేపు సిరిగిందపాడులో వైద్యశిబిరం

రంపచోడవరం, ఏప్రిల్ 12: రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహిసున్నట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయ నందాజీ తెలిపారు. వైద్యశిరంలో కంటి పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లకు వచ్చేవారు ఆధార్, తెల్ల రేషన్ కార్డులను తీసుకురావాలని సూచించారు.

అగ్నిబాధిత కుటుంబాలకు వితరణ

చింతూరు, ఏప్రిల్ 12 : చింతూరు మండలం, ఉలుమూరులో గత నెల 28న ఐదు ఇళ్ళు అగ్నిప్రమాద బారిన పడ్డ విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం మల్లెతోట ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది బాధిత కుటుంబాలను పరామర్శించడం జరిగింది. ఆయా కుటుంబాలకు వంట సామగ్రి, బియ్యం ఇతర నిత్యావసర వస్తువులు, చీరలు అందజేశారు. ఉపాధ్యాయులు పూరి భీమయ్య, భూమిరెడ్డి, ఆదినారాయణ, కన్నారావు, ప్రమ కుమారి, భార్గవి, సీత, సురేష్, వీర్రాజు, రామదాసు, శ్రీనివాసు, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టాలు తొలగాలంటే చంద్రబాబు సీఎం కావాలి


ఇంటింటా ప్రచారంలో మహిళతో మాట్లాడుతున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

» 3వ డివిజన్ ఇంటింటా ప్రచారంలో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: ఐదేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆ కష్టాలు తొలగిపోవాలంటే రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం కావాలని రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 3వ డివిజన్‌లో శుక్రవారం ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనయుడు దగ్గుబాటి హితేష్ చెంచురామ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఎంపీగా పురందేశ్వరికి కమలం గుర్తుపై.. ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపైన ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు తాను లోకల్‌గా రూపొందించిన అంశాలపై కూడిన కరపత్రాలను ప్రజలు అందించి వాటిపై అవగాహన కల్పించారు. నగంలో సుందరీకరణనే అభివృద్ధి అని ఎంపీ భరత్‌రామ్ ప్రజలను మోసం చేశాడన్నారు. అభివృద్ధి అంటే శాశ్వతంగా ఉండాన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రజలకు అభి వృద్ధి సంక్షేమం చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొమ్మనమైన శ్రీనివాస్, జక్కంపూడి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డికి 70 వేల పైన మెజార్టీ ఖాయం

టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: రాజమహేంద్రవరంలో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు 70 వేల పైచిలుకు మెజార్టీ వస్తుందని వైసీపీ వాళ్ళు రాసి పెట్టుకోండని టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కనీస రాజకీయ అనుభవం లేని వైసీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆ పార్టీ నాయకుడు పాలిక శ్రీనులు జాలిమ్ పౌడరు రాసుకుని మేకప్ మాటలు మాట్లాడుతున్నారన్నారు. అలంకరణకు అభివృద్ధికి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో అభివృద్ధి అంటే అది టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. జనసేన నగర ఉపాధ్యక్షుడు రాజేష్ ఖన్నా మాట్లాడుతూ నగరంలో 232 బూత్‌లు ఉంటే కనీసం అది కూడ తెలియకుండా 150 బూత్‌లని వైసీపీ వాళ్ళు అనడం వారి అవగాహన లేమికి నిదర్శనమన్నారు. జగనన్న కాలనీల పేరుతో ప్రజలను దగా చేశారన్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ జనసేన పార్టీలు విడివిడిగా పోటీ చేస్తేనే తమకు 36 వేల మెజార్టీ వచ్చిందని ఇప్పుడు కలిపి పోటీ చేస్తున్నామని మీకు డిపాజిట్లు కూడా రావన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించుకుని ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసును గెలిపించాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకురాలు అధికారి లక్ష్మి, జనసేన నాయకులు అక్కిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బుడ్డిగ రాధా

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపిస్తాం

మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: అభివృద్ధి అంటూ అవగాహన రాహిత్యంతో రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ కారణంగా పలు సమస్యలు ఉత్పన్నమయ్యాయని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పెట్టడంతో ఇరుకుగా మారిందన్నారు. వీటిని వ్యాపారులు తమ దృష్టికి తీసుకురావడంతో వాటిని పెట్టించిన వారే ఆగమేఘాలపై తొలగించారన్నారు. అయితే రోడ్డు మధ్యలో బైక్‌లు, వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతుందని ఆ సమస్యను పరిష్కరించాలని కమిషనర్, డీఎస్పీలను లిఖిత పూర్వకంగా కోరామని తెలిపారు.

రేపు భగవద్గీత అష్టావధానం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 12: రాజమహేంద్రవరం గౌతమి ఘాట్లో ఆదివారం సాయంత్రం 4గంటలకు భగవద్గీత అష్టావధానం జరుగుతుందని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఈసీ మెంబరు వనపర్తి సత్యనారాయణ తెలిపారు. పీఠం రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బల్లిపాడుకు చెందిన తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ విద్యార్థి అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు ఈ అష్టావధానం చేస్తారని తెలిపారు. సాహితీ ప్రియులు విచ్చేసి జయప్రదం చేయాలన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: మహిళలు స్వయం వృద్ధి సాధించాలంటే నైపుణ్యం గల వృత్తులు ఎంతగానో దోహదపడతాయని రాజమహేంద్రవరం సీటీఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్.కే సుమన్ కల్యాణి అన్నారు. లాలాచెరువు స్వర్ణాంధ్రలో 71వ బ్యాచ్ కుట్టు, మగ్గం వర్క్ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను నిర్వాహకుడు గుబ్బల రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు.ఇప్పటివరకు 1,80,090 మందికి శిక్షణ ఇచ్చినట్టు రాంబాబు తెలిపారు.ఈ నెల 15 నుంచి నూతన బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తిగల వారు 98498 47489 నెంబరును సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం టీచర్ దివ్య, కుమారి, రత్నం, ద్వారక, దుర్గ, దేవి, శశికళ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ


పోలోతు జ్యోతిక

గోకవరం, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వీరగణేష్ అర్జునశ్యామల 937 మార్కు లతో ప్రథమ స్థానాన్ని, 908 మార్కులతో వీరలక్ష్మి ద్వితీయ స్థానాన్ని, 890 మార్కులతో అయినాల గౌతమ్ సాయి శ్రీహర్ష తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 425 మార్కులతో విజయ్‌కు మార్(బైపీసీ) ప్రథమ స్థానాన్ని, 433 మార్కులతో అనిష్క (ఎంపీసీ) ద్వితీయ స్థానాన్ని, 402 మార్కులతో యశోదలక్ష్మి(బైపీసీ) తృతీయ స్థానాన్ని సాధించి నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

కోరుకొండలో 59 శాతం ఉత్తీర్ణత

కోరుకొండ, ఏప్రిల్ 12: కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 59శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ శారదా, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 168 మందికి గాను 74 మంది(44శాతం) ఉత్తీర్ణులయ్యారన్నారు. ఎంపీసీలో డి.ధనలక్ష్మి 470కి 438 మార్కులు, ఎస్.మహేశ్వరి 470కి 432 మార్కులు, బైపీసీలో ఆర్ఎల్ భగవతి 440కి 430 మార్కులు, పి.రమ్య 440కి 420మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారన్నారు. సీనియర్ ఇంటర్‌లో 107 మందికి గాను 64 మంది(59శాతం) ఉత్తీర్ణులయ్యారన్నారు. ఎంపీసీలో ఎస్.గౌరీశంకర్ 1000కి 964 మార్కులు, జి.దుర్గమణికంఠ 1000కి 951 మార్కులు, బి.వెంకటదుర్గ 1000కి 946 మార్కులు, సీఈసీలో పి.భవాని 1000కి 906 మార్కులు, శ్రీసత్య 1000కి 906 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

మురమండ కళాశాలలో 57 శాతం..

కడియం: మండలంలోని మురమండ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత 57శాతం నమోదైనట్టు ప్రిన్సిపాల్ టీఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. 35 మంది పరీక్షకు హాజరుకాగా 20మంది ఉత్తీర్ణులయ్యారని, ఎంపీసీ విభాగంలో పోలోతు జ్యోతిక 975 మార్కులు సాధించినట్టు తెలిపారు. ఎంపీసీలో 800 మార్కులు పైబడి ముగ్గురు, బైపీసీలో 750 మార్కులు పైబడి ముగ్గురు విద్యార్థులు ఉన్నారని తెలిపారు. కడియం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో ఫస్టియర్ బైపీసీలో 16 మందికి ఐదుగురు, సీఈసీలో 26 మందికి ఆరుగురు ఉత్తీర్ణులయ్యారని, సెకండియర్ బైపీసీలో 13 మందికి ఏడుగురు పాసవ్వగా సీఈసీ విభాగంలో ఆరుగురికి ఎవరూ ఉత్తీర్ణులు కాలేదని హెచ్ఎం టి.సత్యనారాయణ తెలిపారు.

రంగంపేటలో 56 శాతం..

రంగంపేట, ఏప్రిల్ 12: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 91మంది విద్యార్థులకు 51మంది(56శాతం) ఉత్తీర్ణులయ్యారన్నారు. ఎ.సీతాశ్రావ్య 1000కి 940 మార్కులు, జి.రమ్యశ్రీ 938 మార్కులు, ఎంపీవీ బాలాజీ 865 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్‌లో 40 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఎస్.వీరహాసిని 470కి 446 మార్కులు, సీహెచ్ మాధవి 440కి 415 మార్కులు, ఏవీ దుర్గాప్రసాద్ 500కి 432 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు కృష్ణమూర్తి, రమణ, పద్మావతి, కృష్ణ, జ్యోతి అభినందించారు

సత్తా చాటిన మెగా జూనియర్ కళాశాల

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్దనున్న మెగా జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. సీనియర్ ఎంపీసీలో టివి గంగాంబిక 986 మార్కులు, ఎం.శ్రీరాం 984, డి.పద్మశ్రీ 979, ఎస్‌వీవీడీ.లావణ్య 978 మార్కులు సాధించారు. బైపీసీలో జె.మహేష్ 937, పి.జ్యోత్స్న 920, ఎంఈసీలో వై.గీతాఐశ్వర్య 968, బి.ఝాన్సీ 943మార్కులు, సీఈసీలో డి.పావని కోమలి 912 మార్కులు సాధించారని కళాశాల డైరెక్టర్ గంగాధర్‌చౌదరి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్‌కె బషీరున్నీషా 559 మార్కులు, పి.మహాలక్ష్మి జయశ్రీ 457, టి.విజయసాత్విక 456, ఎస్.రూహిసింగ్ 455 మార్కులు, బైపీసీలో జి.నీలవేణి 434, కె.సోమశరణ్య 424, నాజియ కురీషి 422, ఎంఈసీలో బి.లోచన సూర్యతేజశ్రీ 474, పీవీఎన్‌వీ మనోజ్ రాజ్ 464, సీఈసీలో కె.నాగమణి 467 మార్కులు సాధించారన్నారు. ఫస్టియర్‌లో 900 మార్కులు పైబడి 49మంది, సెకండియర్‌లో 900 పైబడి 24 మంది విద్యార్థులు సాధించారని శుక్రవారం తెలిపారు.

గణితశాస్త్రంలో మూర్తికి పీహెచ్‌డీ

దివాన్‌చెరువు/రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 12: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగంలో పరిశోధన చేసిన రీసెర్చ్ స్కాలర్ డీవీఎస్ఎన్ఆర్ మూర్తికి ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు శుక్రవారం పీహెచ్‌డీ ప్రదానం చేశారు. పరిశోధనా సూపర్‌వైజర్ సీహెచ్ శ్రీనివాసులు పర్యవేక్షణలో కెల్లర్ బాక్స్ పద్ధతి ఉపయోగించి రసాయనిక ప్రతిచర్యలతో వివిధ రకాలైన ఐదు నాన్ న్యూటోనియన్ ఫ్లూయిడ్స్‌పై సంఖ్యాత్మక విశ్లేషణ అనే అంశంపై మూర్తి పరిశోధన చేశారు. కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి టి.హైమావతి, పరిశోధనా సూపర్‌వైజర్ శ్రీనివాసులు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, పరిశోధనాభివృద్ధి విభాగాధిపతి రమణేశ్వరి, ప్రిన్సిపాళ్లు విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాగివస్తువులు, చీరలు పట్టివేత

కడియం, ఏప్రిల్ 12: కడియం మండలం పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద సీఐ బి.తులసీధర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్లులు లేకుండా తీసుకెళుతున్న రూ.71,000 విలువైన రాగివస్తువులు, రూ.1,19,000 విలువైన 140 చీరలను పట్టుకున్నారు. వాటిని ఎఫ్ఎస్‌టీ టీమ్‌కు అప్పగించామన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

గోకవరం, ఏప్రిల్ 12: ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్ఐ కె.నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి, రంపయర్రంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు ధైర్యంగా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీడీపీ శ్రేణులు సమాయత్తం కావాలి

నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 12: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని అనపర్తి, పొలమూరు, మహేంద్రవాడ గ్రామాల్లో బూత్‌కమిటీ ప్రతినిధులు, పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. సమయం తక్కువగా ఉన్నందున ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మామిడిశెట్టి శ్రీను, కర్రి వెంకటరెడ్డి, జుత్తుగ కృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళాశాల వార్షిక, స్పోర్ట్స్ డే

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 12 : రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వార్షిక, స్పోర్ట్స్ డేను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్రాంక్లిన్ టెక్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.శివకుమార్ మాట్లాడారు. భవిష్యత్తును ఆనందమయంగా మలచుకోవడానికి శ్రమపడాలి, కష్టపడాలి అన్నారు.స్పోర్ట్స్ విభాగంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు, అలూమ్ని అధ్యక్షుడు సీరా గంగాధరరావు, కార్యదర్శి ఆర్మస్, మాటూరి సిద్ధార్థ, పీఏ కిషోర్‌బాబు, జి.వెంకటరమణ, అధ్యాపకులు స్వర్ణశ్రీ, డీవీ రమణమూర్తి, శరత్‌బాబు, బీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట భవిత కేంద్రం రాష్ట్రంలో ప్రథమం

అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ రాధిక

రంగంపేట, ఏప్రిల్, 12: ప్రత్యేక అవసరాల పిల్లలను తీర్చిదిద్దడంలో రంగంపేట భవిత కేంద్రం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని రాష్ట్ర అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ ఎస్.రాధిక అన్నారు. శుక్రవారం రంగంపేటలోని భవిత కేంద్రాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. టీఎల్ఎం కిట్లు, ట్యాబ్‌ల వినియోగంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని ఆమె అభినందించారు. విద్యార్థుల నమోదు, హాజరు నిలకడలో కృషి చేస్తున్న కేంద్ర నిర్వాహకులు, ఐఈఆర్టీలు ఎంవీఎస్ ప్రసాద్, జి.అంజి కృషిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా రికార్డులు విద్యాబోధన ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. శారీరక వికాసానికి, మానసిక ఆరోగ్యానికి ఒక రోజు ఫిజియోథెరపీ ద్వారా వైద్యుని సూచనలు తల్లిదండ్రులకు, విద్యార్థులకు తెలిపి చైతన్యపరచడంలోనూ, పదో తరగతి, ఇంటర్, టీచర్ ట్రైనింగ్ కోర్సులకు ఈ కేంద్ర విద్యార్థులు వెళ్లడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష ఐఈ కో ఆర్డినేటర్ ఎస్.కన్నబాబు, ఎంఈవో పి.మధుసూదనరావు, సీఆర్ఎంటి ఎల్.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

కడియం, ఏప్రిల్ 12: మండలంలోని వీరవరంలో శుక్రవారం ఓటు హ క్కుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాధాన్యం, దాని వినియోగంపై అవగాహనా కలిగించారు. డీఆర్‌డీఏ ఆధ్వ ర్యంలో మహిళలతో ర్యాలీ జరిపారు. ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం బి.అప్పలకొండ, కమ్యూనిటీ కోఆర్డినేటర్ డీవీ సింహాచలం, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గ్రామం ప్రశాంతంగా ఉండాలి

కడియం ఏప్రిల్ 12: కడియపు సావరంలో ఈనెల 6న జరిగిన మహాలక్ష్మి అమ్మవారి జాతరలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణతో గ్రామంలో శాంతివాతవరణం దెబ్బతిందని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ అన్నారు. శుక్రవారం కడియం ఎంపీడీవో కార్యాలయంలో సీఐ బి తులసీధర్ అధ్యక్షతన జరిగిన రెండు వర్గాల పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీతోపాటు ఎంపీడీవో మనోజ్‌కుమార్, తహశీల్దార్ బి.రమాదేవి, ఎస్ఐ టి.కృష్ణసాయి పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఇటువంటి ఘటన వల్ల ప్రాణనష్టం జరిగే ప్రమాదముందని, కేసులతో యువత భవిష్యత్ నాశనమౌతుందన్నారు.

రసం పీల్చు పురుగుల నివారణకు చర్యలు

దివాన్‌చెరువు, ఏప్రిల్12: ప్రస్తుతం జీడిమామిడిలో రసం పీల్చు పురుగులు ఆశించడం వల్ల చిగురు, పూత, పిందెలు నష్టపోతున్నాయని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. శ్రీకృష్ణపట్నంలోని జీడిమామిడి తోటలను శుక్రవారం ఆయన పరిశీలించారు.

కూటమి వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులొస్తాయ్

టీడీపీ-జనసేన-బీజేపీ రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి గోరంట్ల


18వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 12: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం భ్రష్టు పట్టిందని, కూటమి వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం 18వ డివిజన్‌లో 18వ వార్డులో ఆయన ఇంటిం టికీ వెళ్లి మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలను అన్ని విధాల ఆదుకున్నామని, గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని, ప్రజలను గాలికి వదిలేసిందని, ధరలను పెంచి సామాన్యులకు బతుకుదెరువు లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి రాంబాబు, మజ్జి పద్మ, మత్యేటి ప్రసాద్, మానుపాటి తాతరావు, కొయ్యన కుమారి, బీజేపీ నాయకులు బోజరాజు హరి, అడపా వరప్రసాద్, ఏలూరు వెంకటేశ్వరరావు, చిట్టిబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 12: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జనసేన పార్టీ నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి అభ్యర్థించారు. ఈ మేరకు దివాన్‌చెరువులోని నీలంతోటలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు దేశాల శ్రీను, వంక మల్లిబాబు, అక్కిరెడ్డి వేణు, యర్రంశెట్టి శ్రీను, గంగి బ్రహ్మరాజు, దాసరి శ్రీను పాల్గొన్నారు. అలాగే పాలచర్లలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగిశెట్టి చంటిబాబు, జనసేన నాయకులు సూరపురెడ్డి రాజారావు, గంగిశెట్టి రాజేంద్ర తదితరులు ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు.

రాక్షస పాలన నుంచి విముక్తికే కూటమి ఏర్పాటు

గోకవరం, ఏప్రిల్ 12: రాష్ట్రంలో రాజ్యమేలుతున్న రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తికి కల్పించేందుకే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పాటైందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. మండలంలోని తంటికొండలోని కూటమి నాయకులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రం బాగుపడాలంటే ప్రభుత్వ వ్యతి రేక ఓటును చీలనివ్వకూడదని, ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూను, ఎంపీగా తంగెళ్ల ఉదయశ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అలాగే తంటికొండ, గాదెలపాలెం గ్రామాల్లో జ్యోతుల నెహ్రూ కోడలు లక్ష్మీదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఒక ఓటు సైకిల్ గుర్తుకు, మరో ఓటు గాజు గ్లాసు గుర్తుకు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

జాతీయ స్థాయి వెబ్‌నార్

రాజమహేంద్రవరంకల్చరల్, ఏప్రిల్ 13 : శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం బయోలాజికల్ సైన్స్ ఫర్ ద వెల్ఫేర్ ఆఫ్ మ్యాన్‌కైండ్ పై జాతీయ స్థాయి వెబ్‌నార్‌ను జంతు శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో నిర్వహించా రు. కళాశాల ప్రిన్స్‌పాల్ పి.రాఘవ కుమారి వెబ్‌నార్‌ను ప్రారం భించి ముఖ్య అంశాలను తెలిపారు.ఈ కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాధిపతి ప్రియాంక, అధ్యాపకులు జి.దివ్యశ్రీ, దీపికారాణి, ఎం.కాస్మలను అభినందించారు.

నిర్వాసితులకు సీఎం ఇచ్చిన హామీ ఏమైంది

అరకు పార్లమెంట్ కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత


కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు గిరిజన సంప్రదాయ పద్ధతిలో స్వాగతం

చింతూరు, ఏప్రిల్ 12: పోలవరం నిర్వాసితులకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని అరకు పార్లమెంటరీ, రంపచోడవరం ఎమ్మెల్యే కూటమి అభ్యర్థులు కొత్తపల్లి గీత, మిరియాల శిరీషదేవిలు ప్ర శ్నించారు, ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చింతూరులో రోడ్ షో నిర్వహించారు. ముందుగా అమ్మ వారి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంత రం కూటమి అభ్యర్థులకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. రోడ్‌షోలో అభ్యర్థులు మాట్లాడుతూ అధికార పార్టీని దుయ్యబట్టా రు. ప్రధానంగా పోలవరం నిర్వా సితులకు సీఎం చేసిన దగా తీరుపై విరుచుకుపడ్డారు. ఇదిగో అదిగో అంటూ పరిహారం, అదనపు భూ నష్టపరిహారంపై కాలం గడపిన తీరు చివరకు చేతులెత్తేసిన వైనంపై అభ్యర్థులు ప్రశ్నల వర్షం కురిపించారు. కూటమి అధికారంలోకి రాగానే పోలవరం ముంపు మండలాల అభివృద్ధికి, ముంపు బాధితులకు న్యాయం చేసే విషయంలో ఓ ప్రత్యేక మేనిఫెస్టో రూ పొందించుకొని ఆమేరకు చర్యలు తీసుకుంటామన్నారు. గడచిన ఐదేళ్లలో అభివృద్ధి కనుమరుగైందని, పథకాలు కూడా చాలామంది అర్హులకు అందడంలేదని వారు అన్నారు. ప్రజలు కొన్ని ప్రదేశాలలో అధికార పార్టీపై తిరుగుబాటుకు దిగుతున్నారన్నారు. కార్యక్రమంలో ఇల్ల చిన్నారెడ్డి, మడివి రాజు, డీవీఎస్ రమణారెడ్డి విలీన మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.0	24.0

హైస్కూల్ ప్లస్‌కు..మళ్లీ నిరాశే

- ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఐదో స్థానంలో తూర్పు
- గతేడాదికంటే మెరుగుపడిన ఉత్తీర్ణత శాతం
- సీనియర్ ఇంటర్‌లో పైచేయి సాధించిన బాలురు
- రెగ్యులర్ జూనియర్ 75..సీనియర్ 83 శాతం
- హైస్కూల్ ప్లస్ జూనియర్ 26.. సీనియర్ 36 శాతం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో తూర్పుగోదావరి రాష్ట్ర స్థాయిలో మూడు స్థానాలు మెరుగుపడి ఐదో స్థానంలో నిలిచింది. వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకొచ్చిన 'హైస్కూల్ ప్లస్' మళ్లీ తుస్సుమనిపించింది. జిల్లాలో మొదటి ఏడాది 19039 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 14357 మంది 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాది 15394 మంది పరీక్షలు రాయగా 12837 మంది విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి ఏడాది 9278 మంది బాలలకు 6975 మంది 75 శాతం,9761 బాలికలకు 7382 మంది 76 శాతం మంది, రెండో ఏడాది 7409 మంది బాలలకు 6212 మంది 84 శాతం, 7985 మంది బాలికలకు 6625 మంది 83 శాతం ఉత్తీర్ణత సాధిం చారు. హైస్కూల్ ప్లస్‌లో మొదటి ఏడాది 26 శాతం, రెండో ఏడాది 36 శాతం మంది విద్యార్థులు మాత్రమే పాసయ్యారు.ఈ నెల 18 నుంచి 24 వరకూ రీకౌంటింగ్, రీవెరిఫికేషన్, సప్లి మెంటరీ, ఇంప్రూవ్ మెంట్‌కి దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్ఐవో ఎన్ఎస్ వీఎల్ నరసింహం తెలిపారు. సప్లిమెంటరీ, ఇంప్రూవ్ మెంట్ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1 వ తేదీ వరకూ నిర్వహిస్తారన్నారు. సమష్టి కృషి, విద్యార్థుల శ్రమ మంచి ఫలితాలు సాధించడానికి దోహదపడ్డాయన్నారు. ఉత్తీర్ణత సాధించని విద్యా ర్థులు నిరాశకు గురికావొద్దని సూచించారు.

రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్స్



ఎం.భాను (బైపీసీ 939) | ఎ.లావణ్య (ఎంఎల్టీ 974) | ఎం.మోహన కృష్ణ (సీఈసీ 915) | జి.గీత (ఎంపీ హెచ్‌డబ్ల్యు 965)

పురందేశ్వరి గృహ ప్రవేశం

రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులో నివాసం



గృహం ప్రవేశం చేస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు



అదే ఇంటిలో యాగం చేస్తున్న దంపతులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 12 : రాజమహేంద్రవరం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం గృహ ప్రవేశం చేశారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులో ఉన్న ఇంటిలో శుక్రవారం దిగారు. నూతన గృహ ప్రవేశం సందర్భంగా దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు యాగం నిర్వహించారు.గతంలో పాత ఎస్పీ కార్యాలయం ఎదురుగా రాజమహేంద్ర వరం పార్లమెంట్ బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభించారు. అంతా అక్కడి నుంచే పురందేశ్వరి కార్యక్రమాలు చేస్తారని అనుకున్నారు. అయితే అనూహ్యంగా ఆమె ఒక ఇంటిని కూడా తీసుకున్నారు. పార్టీ కార్యాలయానికి చాలా దగ్గరగానే ఇల్లు తీసుకు న్నా రు.ఈ గృహ ప్రవేశానికి కుటుంబీకులు, ముఖ్యమైన బంధువులు మాత్రమే హాజర య్యారు. గృహప్రవేశం అనంతరం అదే ఇంటిలో దగ్గుబాటి దంపతులు ప్రత్యేకంగా యాగం కూడా చేయించారు. ఈ సందర్భంగా రాజమహేంద్ర వరంతో తమకున్న అనుబంధాన్ని కుటుంబీకులు గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

గొంతెండిపోతోంది!



నాయకులు చెప్పేవన్నీ వట్టి గాలిమాటలే.. ఎన్నికల సమయంలో అంతలేదు.. ఇంతలేదంటారు.. తీరా చూస్తే ఏళ్ల తరబడి ఉన్న సమస్య అయినా మళ్లీ ఐదేళ్లకు కానీ కంటికి కనపడదు.. చెవులకు వినపడదు..!? గత ఎన్నికల సమయంలో ఇంటింటికీ గోదావరినీరు హామీని వైసీపీ ప్రభుత్వం తెరపైకి తెచ్చింది.. సుమారు రూ.4 వేల కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.. ఐదేళ్లు గడచిపోయింది.. మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి.. ఇంటింటికీ గోదావరి నీరు పథకం గాలిలోనే ఉంది.. పథకం మాటెలా ఉన్నా నేటికీ గోదావరి చెంతనే గొంతెండిపోతోంది.. ఎక్కడో మారుమూల కాదు సుమా ఇటు రాజమహేంద్రవరం అటు కొవ్వూరు.. నిడదవోలు పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి.. జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లోనూ ఇంతే. వేసవి వచ్చిందంటే మంచినీళ్లకు కటకటలాడిపోతున్నారు.. ఎదురుగా కొన్ని లక్షల క్యూసెక్కుల నీరు ఉన్నా గొంతు తడారిపోతూనే ఉంది.. పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా పరిణమించింది.

- గోదారి చెంతనే ఉన్నా.. గొంతు తడవదు
- పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలక్ష్యం
- కలెక్టర్ ఆదేశాలు భేఖాతర్
- హుకుంపేటలో ఆరునెలలుగా ఇక్కట్లు
- సీతానగరంలో నిలిచిన కుళాయి పనులు
- ఐదేళ్లగా అతీగతీలేని పురుషోత్తపల్లి ఎత్తిపోతల

హుకుంపేటలో కట్‌కట!



రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 12 : గోదావరికి ఆమడ దూరం.. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామం.. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం రూరల్ లోని ఒక ప్రాంతం.. కలెక్టరేట్‌కి కూత వేటు దూరం.. అయినా నేటికీ మంచినీటి కుళాయిలు రాక ప్రజలుకటకటలాడిపోతున్నారు.. అయినా పట్టించుకునే వారే లేరు.. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు చేపట్టాలంటూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా పంచాయతీ అధికారులుగాని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గాని తగు చర్యలు తీసుకోవడం లేదంటు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధి హుకుంపేట పంచాయతీ పరిధిలో గల రామకృష్ణ నగర్, ఆదర్శనగర్, నాగిరెడ్డినగర్,సావిత్రినగర్, శ్యామలానగర్ తదితర ప్రాంతాల్లో గత 6 నెలలుగా గోదావరి మంచినీటి కుళాయిల ద్వారా మంచినీరు రావడం లేదు. దీంతో ప్రజలు మంచినీటికి కటకటలాడిపోతున్నారు. 1996లో ఆ ప్రాంత జనాభా ప్రాతిపదికన 90 వేల సామర్థ్యంగల నీళ్ల ట్యాంకు నిర్మించారు. ప్రస్తుత జనాభా సుమారు 5500 నుంచి 6000 మంది వరకు నివాసం ఉంటున్నారు. ముఖ్యంగా రిటైర్డ్ అయిన ఉద్యోగులు ఎక్కువగా వుంటున్నారు. ప్రజాప్రతినిధులు వచ్చి వెళుతున్నారే తప్ప తమ సమస్యలను పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. పంచాయతి అధికారులకు ఎన్ని మార్లు విన్నవించుకున్నా శాశ్వత పరిష్కారం లేదని చెబుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు హుకుంపేట గ్రామానికి ప్రత్యేకాధికారిగా ఉన్నారు.అయినా ఏ రోజు గ్రామంలో పర్యటించిన పాపాన పోలేదని దీంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ ప్రాంతంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ట్యాంకుల శుభ్రత గాలికి..

కోరుకొండ, ఏప్రిల్ 12 : అధికారులు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని చెబుతుంటారు.. అయితే మంచినీటి ట్యాంకుల శుభ్రతను మాత్రం మర్చిపోతారు. కోరుకొండ మండలంలో అనేక గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. ప్రతి 15 రోజులకొకసారి మంచినీటి ట్యాంకులు శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లాల్సి ఉంది. కానీ ఎక్కడా మంచినీటి ట్యాం కులు శుభ్రపరచిన సంఘటనలు లేవు.ప్రతి గ్రామంలోను మంచినీటి సరఫరాకు నాలుగైదు జీఎస్ఆర్ ట్యాంకులు నిర్మించారు. వాటి చుట్టూ పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి మురుగు గుంటలుగా మారినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీని వల్ల మంచినీటి ట్యాంకుల వద్ద మురుగునీటితో కలుషితమవుతోంది. గ్రామాల్లో భగవాన్ సత్యసాయి మంచినీటి సరఫరాకు ప్రత్యేకంగా జీఎల్ఆర్ ట్యాంకులు నిర్మించారు. ట్యాంకుల వద్ద అపరిశుభ్రమైన వాతావరణం కనిపిస్తుంది. ట్యాంకుల వద్ద పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిధుల్లేక.. ఇంటింటికీ రాని కుళాయి



సీతానగరం,ఏప్రిల్ 12 : వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని గ్రామాల్లో ఇంటింటికి మంచినీటి కుళాయి ఇస్తామని చెప్పినప్పటికి ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. సీతానగరం మండలంలో రూ. 18.10 కోట్ల అం చనా వ్యయంతో ప్రారంభించిన పనులు నిధులు లేక నిలిచిపోయాయి. ఇంటింటికి మంచినీటి కుళాయి వస్తుందన్న ప్రజల ఆశ నిరాశగానే మిగిలింది. ఎక్కడ సమావేశం జరిగినా ఇంటింటికి కుళాయి ఇస్తామని నేతలు గత ఐదేళ్లుగా పదేపదే చెబుతున్నారు. అయినప్పటికీ నిధులు విడుదల కక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.13 హేబిటేషన్లలో పనులు పూర్తయ్యాయని చెబుతున్నా మిగిలిన 19 హేబిటేషన్లలో పనులు జరగడం లేదు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్‌ను వివరణ కోరగా మండలంలోని 32 హేబిటేషన్లకు 13 హేబిటేషన్లలో పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. గత 3 నెలలుగా విడుదల కాలేదని తెలిపారు.

జగన్ పగ..నీరుగారిన లక్ష్యం!

- అసంపూర్తిగా నిలిచిపోయిన పురుషోత్తపల్లి ఎత్తిపోతల పథకం
- రూ.1638 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు నిరుపయోగం
- చంద్రబాబు హయాంలో ఆరంభం.. ఐదేళ్లుగా పట్టించుకోని జగన్
- పర్యావరణ అనుమతులు లేవని నిలిచిన పథకం

సీతానగరం, ఏప్రిల్ 12 :చంద్రబాబు లక్ష్యం ఘనం.. జగన్ నిర్లక్ష్యానికి నిలువుటద్దం..ఈ ప్రాజెక్టు.. నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మెట్ట ప్రాంత వాసుల సాగు, తాగునీరు అవసరాలను తీర్చడానికి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం చేపట్టారు. చాలా వరకూ పూర్తి చేశారు.అయితే పర్యావరణ అనుమతులు లేవనే కారణంతో ప్రాజెక్టును అడ్డుకున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్లయినా వేల కోట్లతో సాగు, తాగునీటి అవసరాల నిమిత్తం కట్టిన ప్రాజెక్టు నిరుపయో గంగా మార్చేశారు. ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎత్తిపోతల పథకం ప్రాధాన్యత నీరుగారిపోతోంది. 2017వ సంవత్సరంలో జలసిరి హారతి పథకంలో భాగంగా 28 ఇరిగేషన్ ప్రాజెక్టులను తెలుగుదేశం ప్రభుత్వం తలపెట్టింది వాటిలో పురుషోత్తపట్నం ఒకటి. ఇది 2.15 లక్షల ఎకరాల భూమికి.. విశాఖ వాసులకు తాగునీరందించాలన్న ఉద్దేశంతో రూపుదిద్దుకుంది. రాజానగరం, జగ్గంపేట ,పిఠాపురం , పెద్దాపురం, ప్రత్తిపాడు మండలాలకు పోలవరం కెనాల్ ద్వారా 20 వేల ఎకరాలకు, లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 67 వేల ఎకరాలకు వ్యవసాయ భూములకు నేరుగా సాగునీరందించేందుకు రూపకల్పన చేశారు. పోలవరం చానల్స్ ద్వారా ఏలేరు రిజర్వాయర్‌కు నీరు మళ్లించి అక్కడ నుంచి దగ్గరలోని చెరువుల్లోకి నీరు పంపుతారు. ఈ మేరకు 10 పంపులను పురుషోత్తపట్నం పంపింగ్ స్కీం వద్ద ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పంపు 350 టీఎంసీల నీటిని విడుదల చేసే సామర్థ్యంతో ఏర్పాటు చేసారు. 50 వేల ఎకరాల భూమికి 2 పార్టులుగా విభజించి ఒకటి 7 వేల ఎకరాలు.. మరొకటి 43 వేల ఎకరాలు మొత్తం 50 వేల ఎకరాలకు ఏలేరు రిజర్వాయరు ద్వారా సాగునీరందించాల్సి ఉంది.రూ.1638 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు. ఆగస్టు 15వ తేదీన ఫస్ట్ పేజ్‌లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు 2 పంపులను ప్రారంభించారు.అయితే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు లేవని ఎన్‌జీటీలో పిటిషన్ దాఖలు కావడంతో పంపింగ్ స్కీమ్‌ను నిలిపివేశారు. ఈ కేసును గతేడాది విచారించిన సుప్రీంకోర్టు రూ.2.48 కోట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలికి చెల్లించాలని ఆదేశించింది. నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయలేదు. ప్రభు త్వం నిర్లక్ష్యం చేయడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీంతో లక్షలాది మంది రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. విశాఖవాసుల గోదావరి నీటి కల తీరకుండా ఆగిపోయింది.



నిరుపయోగంగా పురుషోత్తపల్లి ఎత్తిపోతల పథకం

నేను రాజకీయాలకు దూరం : ఉండవల్లి



రాజమహేంద్రవరం, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి) : నేను ఏ పార్టీలోనూ లేను. రాజకీ యాలకు దూరంగా ఉన్నాను. ఓటు హక్కు మాత్రం వినియోగించుకుంటాను. కానీ నేను బీజేపీకి మాత్రం వ్యతిరేకమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం ధర్మంచర హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లా డారు. మార్గదర్శి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు సంతోషాన్ని కలిగించాయని, రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించవల సిందిగా తెలంగాణ హైకోర్టును ఆదేశించిందన్నారు. ఆరునెలల్లో విచారణ మొదలుకావొచ్చని, ఓ ఏడాదిలోపు పూర్తవుతుందని, డిపాజిట్లకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నానన్నారు.



రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న వంటసామగ్రి

రైల్వే స్టేషన్‌లో వంట సామగ్రి స్వాధీనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజ మండ్రి రైల్వే స్టేషన్ పార్శిల్ కార్యాలయంలో సరైన పత్రాలు లేని వంట సామగ్రిని ప్రభుత్వ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ విజయ్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల తనిఖీల్లో భాగంగా జీఆర్పీ ఎస్ఐలు ఎం.మావుళ్లు, పి.లోవరాజు తమ సిబ్బందితో పార్శిల్ కార్యాలయంలో తనిఖీలు చేయగా బెంగళూరు నుంచి వచ్చిన ఓ కన్‌సైన్‌మెంటులో నాన్‌స్టిక్ కుక్‌వేర్ గుర్తించడం జరిగిందన్నారు. సుమారు 84 వస్తువుల్లో 40 వస్తువులకే బిల్లులు ఉండడం,మిగతా వాటికి సరైన రశీదులు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని ఎన్నికల గ్రీవెన్స్ కమిటీకి అప్ప గించామని సీఐ తెలిపారు.డీఎస్ఆర్పీ ఎల్.మోహనరావు పర్యవేక్షణలో రాజమహేంద్ర వరం రైల్వే సబ్ డివిజన్ పరిధి రైల్వే స్టేషన్లలో పటిష్టమైన నిఘా పెట్టామని చెప్పారు.



ఈవీఎంల ర్యాండమైజేషన్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంల మొదటి రాండమైజేషన్ రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ ఆఫీసర్ సూచనలు మేరకు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారిణి ,కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం జిల్లా స్ట్రాంగ్ రూమ్ కమ్ వేర్‌హౌస్ గొడౌన్ లో ఈవీఎంల మొదటి రాండమైజేషన్ ప్రక్రియని స్వయంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు.జిల్లా ఆర్వో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఈ నెల 12,13 తేదీల్లో రాజమహేంద్రవరంలోని జిల్లా స్ట్రాంగ్ రూమ్ కమ్ వేర్ హౌస్ గోడౌన్‌లో ఈవీఎంల మొదటి రాండమైజేషన్ పనులు ప్రారంభించామన్నారు. ఇప్పటికే జిల్లాకు కేటాయించిన 5,971 బ్యాలెట్ యూనిట్స్ ,5,463 కంట్రోల్ యూనిట్స్ ,వీవీపాట్ యూనిట్స్ 4,927 లను సాంకేతికంగా తనిఖీ చేసి వాటి పని తీరును నిర్ధారణ చేసి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. ఒక్కో ఈవీఎం భద్రపరిచే బాక్స్‌లో 10 యూనిట్స్ ఉంటాయని తెలిపారు. ఒక్కో యూనిట్ ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం చొప్పున 7 నియోజకవర్గాలకు కేటాయించి.. సీరియల్ నెంబర్లను స్కానింగ్ చేస్తారన్నారు.పార్లమెంట్‌కి సంబంధించిన ఈవీఎం ర్యాండమైజేషన్ చేసి ఆయా నియోజకవర్గాలకు తరలించనున్నట్టు తెలిపారు. రాజ మహేంద్రవరం సిటీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను ఎస్‌కేవీటీలోని పైఅంతస్తులోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు.ఈ ప్రక్రియను ఆర్‌వో దినేష్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ ఆర్‌వో ఎస్.తేజ్‌భరత్,కొవ్వూరు ఆర్‌వో అశుతోష్ శ్రీవాత్సవ్ , డీఆర్‌వో జి.నరసింహం, రాజానగరం ఆర్‌వో ఏ చైత్రవర్షిణి, గోపాలపురం ఆర్‌వో కెఎల్ శివజ్యోతి, అనపర్తి ఆర్‌వో ఎమ్.మాధురి, నిడదవోలు ఆర్‌వో ఆర్‌వి రమణా నాయక్, రాజమండ్రి పార్లమెంట్ ఆర్‌వో ఎస్‌డీసీ ఆర్ కృష్ణానాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భాను ప్రకాష్, పి. సువర్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు నలబాటి శ్యామ్, సిహెచ్ శ్రీనివాసరావు, సలాది ఆనంద్, జి వెంకటరావు, వీఎస్ శ్యామల పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

సీతానగరం/బిక్కవోలు/కోరుకొండ/ రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 12 : వలంటీర్లు రాజీనామాలు చేస్తూనే ఉన్నారు. దాదాపు అన్ని మండలాల్లోనూ రాజీనామాలు పెరిగాయి.సీతానగరం మండలంలో శుక్రవారం ఒక్కరోజే మొత్తం 63 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వలన రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా పత్రంలో పేర్కొన్నారని ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. బిక్కవోలు 4వ సచివాలయ వలంటీర్లు 16 మంది శుక్రవారం రాజీనామాలు చేసారు. వీటిని సచివాలయ కార్యదర్శి రోజాకు అందజేశారు. ఇదే బాటలో పలువురు వలంటీర్లు సోమవారం రాజీనామాలు చేయనున్నట్టు తెలిసింది. కోరుకొండ మండలంలో 6 గ్రామాలకు చెందిన 64 మంది వలం టీర్లు శుక్రవారం సామూహిక రాజీనామాలు చేశారు. వీరు తమ రాజీనామా పత్రాలను కోరుకొండ ఎంపీడీవో పి. కృష్ణమూర్తికి అందజేశారు. రాజీనామాలు సమర్పించిన వారిలో కణుపూరు, రాజవరం, బొల్లేద్దుపాలెం, గరగలంపాలెం, నిడిగట్ల గ్రామాలకు చెందిన వలంటీర్లు ఉన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిలో ఇప్పటి వరకు మొత్తం 114 మంది తమ రాజీనామా పత్రాలను రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావుకు అందజేశా రు. వీరిలో తొర్రేడు 3, శాటిలైట్ సిటీ 6, పిడింగొయ్యి 20, కోలమూరు 24, కాతేరు 8, హుకుంపేట 8, బొమ్మూరు 1, ధవళేశ్వరం 44 మంది వలంటీర్లు రాజీనామా సమర్పించిన వారిలో ఉన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ రాజీనామాలు దుమారం రేపుతున్నాయి.

రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా

కాంగ్రెస్ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి రుద్రరాజు



కొవ్వూరులో కాంగ్రెస్ పథకాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రుద్రరాజు

కొవ్వూరు, ఏప్రిల్ 12: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పదేళ్లు ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామని రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు ప్రకటించారు. కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే అభ్యర్థి అరిగెల అరుణకుమారితో కలిసి స్థానిక విజయవిహార్ సెంటర్‌లో మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే రైతుల కోసం రూ.2లక్షలు, ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ. 400, పేద మహిళలకు మహాలక్ష్మి పథకంలో నెలకు రూ.8333, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ఏపీపీఎస్సీ ద్వారా 2.25 లక్షల మంది ఉద్యోగాలను ఇవ్వాలనే అంశాలను రూపొందించామన్నారు. సామాజిక పింఛన్ రూ.4 వేలు, దివ్యాంగ పింఛన్ రూ.6 వేలు అందించడానికి నిర్ణయించామన్నారు. చంద్రబాబు, జగన్ బీజేపీతో కుమ్మక్కై పోలవరం, ప్రత్యేక హోదా సాధించలేక పోయారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గంధం పూజ్య నరసింహబాపూజీ, కొణిదల శ్రీనివాసరావు, పాలకుర్తి ప్రభాకర్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు వాటర్‌కూలర్ బహూకరణ

కొవ్వూరు, ఏప్రిల్ 12: కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు శ్రీ శివసాయి దామం సేవా సమితి సభ్యులు వాటర్‌కూలర్‌ను శుక్రవారం బహూకరించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, సిబ్బంది సౌకర్యార్థం సేవా సమితి అధ్యక్షుడు కసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో వాటర్‌కూలర్‌ను ఏర్పాటుచేశారు. అందుకు సంబంధించిన పత్రాలను సీఐ వి.జగదీశ్వరరావుకు అందజేశారు.

తాళ్లపూడిలో బేటీ బచావో బేటీ పడావో



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తాళ్లపూడి, ఏప్రిల్ 12: తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి మాట్లాడుతూ కౌమారదశలోకి వచ్చిన ఆడపిల్లలకు వారు ఎవరితో ఎలా ప్రవర్తించాలి, బాడ్ టచ్, గుడ్ టచ్, బాలికలు తీసుకోవలసిన ఆహార విషయాలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సుజాత, పాఠశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా

నల్లజర్ల, ఏప్రిల్ 12: నల్లజర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ పంపుసెట్లకు (త్రీఫేజ్) విద్యుత్ ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు, రాత్రి 11గంటల నుంచి 12గంటల వరకు ఇవ్వనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ డి.వీరభద్రరావు తెలిపారు. ఉదయం 11గంటల వరకు సింగిల్ ఫేస్ ఇవ్వనున్నట్టు చెప్పారు.

అందరికీ అందుబాటులో ఆర్‌ఆర్ హాస్పిటల్



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న జనార్దనరావు

తాళ్లపూడి, ఏప్రిల్ 12: తాళ్లపూడిలో ఆర్‌ఆర్ ఎమర్జెన్సీ హాస్పిటల్ నూతనంగా ఆర్‌ఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌గా నూతన భవనంలో ప్రముఖ వ్యాపారవేత్త సింహాద్రి జనార్దనరావు ప్రారంభించారు. ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ మంచి వైద్యం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, టీడీపీ ద్విసభ్య కమిటీ జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ప్రముఖ డాక్టర్ ఈ.మంగన్న, నామన పరమేశ్వరరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఎన్నికల కోడ్ అడ్డంకి కాదు : బొంతా శ్యాం

కొవ్వూరు, ఏప్రిల్ 12: అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఎన్నికల కోడ్ అడ్డంకి కాదని ప్రజాస్వామ్యవాది బొంతా శ్యాం రవిప్రకాష్ అన్నారు. ప్రపంచ మేధావి అంబేడ్కర్ జయంతిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు, ఐక్యరాజ్యసమితి ప్రపంచ విజ్ఞాన దివస్‌గా జరిపిస్తారని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా పార్లమెంటు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తారని జపాన్, జర్మనీ వంటి దేశాల్లో కూడా ఆయన జయంతి నిర్వహిస్తారన్నారు. 2024 ఏప్రిల్ 1న అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో రూ.లక్ష వెచ్చించి అంబేడ్కర్ జయంతి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకల్లో రాజకీయ పార్టీ జెండాలు కాని, పార్టీ పరమైన ఉపన్యాసాలు కాని లేకుండా చూసుకోవాలన్నారని శ్యాం రవిప్రకాష్ తెలిపారు.

ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలి : సీఐ

అంబేడ్కర్ జయంతి, శ్రీరామనవమి వేడుకలను ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలని సీఐ వి.జగదీశ్వరరావు శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 పోలీసుయాక్టు 1861, ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి, 17న శ్రీరామనవమి వేడుకలు డీజే సౌండ్స్, ఊరేగింపులు, ర్యాలీలు లేకుండా నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లారీని ఢీకొని యువకుడి మృతి

మరొకరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలోమృతి చెందిన యువకుడు

పెరవలి, ఏప్రిల్ 12: నిడదవోలు-నరసాపురం రోడ్డులో కానూరు వద్ద జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో అన్నవరప్పాడుకు చెందిన వసంతాడ మధు(20), నిడదవోలు మండలం కలవచర్లలో దగ్గరి బంధువైన ముప్పిడి నాగచరణ్‌తో కలిసి అన్నవరప్పాడు వస్తుండగా మార్గమధ్యలో కానూరు వద్ద లారీని ఢీకొట్టారు. దీంతో మధు అక్కడికక్కడే మృతి చెందగా నాగచరణ్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మూర్తి తెలిపారు.

ఒలింపియాడ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దేవరపల్లి, ఏప్రిల్ 12: దేవరపల్లి శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఇండియన్ నేషనల్ ట్యాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించినట్టు ప్రిన్సిపాల్ కిషోర్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఒలింపియాడ్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. దీనికి సీఐ సురేష్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి కే.హరిప్రియ గ్రాండ్ ప్రైజ్‌కు ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ ఒలింపియాడ్‌లో ట్యాబ్‌లు, గోల్డ్ మెడల్, స్మార్ట్‌వాచ్‌లు కన్సోలేషన్ ప్రైజ్‌లుగా సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీహరిరావు, ఆర్‌ఐ ఉదయభాస్కర్, ఏజీఎం పార్థసారధి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమన్వయ సమావేశం

నల్లజర్ల, ఏప్రిల్ 12: నల్లజర్లలోని ప్రియాంకా కన్వెన్షన్ హాల్లో శనివారం సాయంత్రం 4గంటలకు నిర్వహించే టీడీపీ నియోజకవర్గ సమన్వయ సమావేశానికి నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు విచ్చేస్తున్నారన్నారు. అందరు సమష్టి పోరుతో అరాచక వైసీపీని ఓడించి చంద్రబాబును సీఎం చేయాలన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ



కవల గాయత్రి

దేవరపల్లి, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దేవరపల్లి మండలంలో ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో దేవరపల్లి జడ్పీ స్కూల్ విద్యార్థిని కవల గాయిత్రీ ఎంపీసీలో వెయ్యికి 810మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు ఎంఈవో తిరుమలదాసు తెలిపారు. మండలంలోని యర్నగూడెం, దేవరపల్లి జూనియర్ కాలేజీల్లో ద్వితీయ సంవత్సరం 21మంది విద్యార్థులు హాజరుకాగా 20మంది(99శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీలో 9మందికి 9మంది సీఈసీలో ఏడుగురికి ఏడుగురు బైపీసీలో ఐదుగురు హాజరుకాగా నలుగురు పాసైనట్టు తెలిపారు. యర్నగూడెం గ్రామానికి చెందిన వైసింగ కావ్య మొదటి సంవత్సరం 450మార్కులకు 381మార్కులు సాధించారు. సీఈసీలో అక్కాబత్తుల కారుణ్య 500మార్కులకు 471 మార్కులు సాధించడంతో ఎంఈవోలు ఎం.తిరుమలదాసు, ఎస్‌వీవీ అప్పారావు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. దేవరపల్లి విద్యార్థిని కవల గాయిత్రీ మండలంలో ప్రథమంగా నిలవడంతో ప్రధానోపాధ్యాయులు శ్రీలక్ష్మి, యూటీఎఫ్ జిల్లా నాయకులు హంస్సే శంకరుడు అభినందించారు.

కొవ్వూరులో 64 శాతం ఉత్తీర్ణత



జేడీ వెంకటేష్

కొవ్వూరు, ఏప్రిల్ 26: కొవ్వూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ 74 మంది జనరల్ విద్యార్థులు పరీక్షలకు హజరుకాగా 47 మంది(64 శాతం), ఒకేషనల్ 13 మందికి 12 మంది(92 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్ 70మంది జనరల్ విద్యార్థులు 45 మంది(64 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ 14 మందికి 12 మంది(85 శాతం) ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు మండలం కుమారదేవం గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఫస్టియర్ 77 మందికి 73 మంది(94.8 శాతం), సెకండియర్ 79 మందికి 68 మంది(86 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలో ఎంపీసీ చదువుతున్న ప్రకాశరావుపాలెంకు చెందిన కోనపాము వర్షిణి అత్యధికంగా 932, మెల్ల సన్వికుమారి 928, బైపీసీ చదువుతున్న పసనగంటి పింకీ 925, ఎపిచర్ల బాలవాణి 916 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.సుజాత తెలిపారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఫస్టియర్ 135 మందికి 43 మంది, ఒకేషనల్ 78 మందికి 56 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ 148 మందికి 65 మంది, ఒకేషనల్ 80 మందికి 67 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్(సీఎస్‌సీ)లో జనపరెడ్డి దుర్గా వెంకటేష్ 962, ఎంపీసీలో బచ్చు జాస్పర్ మణికుమార్ 954, బైపీసీలో షావుకారు శృతి 924 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ గారపాటి సతీష్ తెలిపారు.

చాగల్లులో 76 శాతం ఉత్తీర్ణత



ఆయేషా సాధిక్

చాగల్లు, ఏప్రిల్ 12: చాగల్లు ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ జూనియర్ కళాశాల 76 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ వి.పావని తెలిపారు. సీనియర్ ఇంటర్ పరీక్షలకు 50 మంది హాజరుకాగా 38 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. బైపీసీలో ఎండీ ఆయేషా సాధిక్ 949 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గాను, ఎంపీసీలో వీరవల్లి దుర్గ 943 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్టు పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్‌లో పరీక్షలకు 74 మంది హాజరుకాగా 30 మంది(40.5 శాతం) ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉండ్రాజవరంలో 54శాతం ఉత్తీర్ణత

ఉండ్రాజవరం, ఏప్రిల్ 12: ఉండ్రాజవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 54 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు కె.మాణిక్యాలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 13మందికి ఏడుగురు ఉత్తీర్ణత సాధించారు. సీఈసీ గ్రూపులో 10మందికి ఆరుగురు ఉత్తీర్ణులు కాగా గున్నేపల్లి తన్విక 500మార్కులకు 371 సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. ఎంపీసీ గ్రూపులో ముగ్గురు పరీక్షలు రాయగా ఒకరు ఉత్తీర్ణులు కాగా 470మార్కులకు 405 సాధించి ఎం.శిరీష ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు.

గురుకుల పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత

గోపాలపురం, ఏప్రిల్ 12: విద్యార్థులు కృషి పట్టుదలతో చదవడంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.కృష్ణవేణి 966 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా బైపీసీలో సౌమ్య 964 మార్కులతో ద్వితీయ స్థానంలోను, జీ.మేఘన 961 మార్కులతో సాధించి తృతీయ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 80.30శాతం ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. ఎంపీసీలో ఎస్.స్పందన 424 మార్కులు, బైపీసీలో ఎం.నిర్మలకుమారి 429 మార్కులు సాధించినట్టు తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం 23మంది విద్యార్థులకు 8మంది(35శాతం), రెండో సంవత్సరం 14మందికి 8మంది(55శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ఘనంగా అచ్చిబాబు పుట్టినరోజు వేడుకలు

▸ శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 12: టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ సీనియర్ నాయకుడు, ఆంధ్రా షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుత రామయ్య (అచ్చిబాబు) పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం దొమ్మేరులో అచ్చిబాబు అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కట్‌చేశారు. ఆయనను ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి గజమాలతో సత్కరించారు. అచ్చిబాబుకు టీడీపీ-జనసే-బీజేపీ



అచ్చిబాబును గజమాలతో సత్కరిస్తున్న ద్విసభ్య కమిటీ చిత్రంలో ముప్పిడి



కేక్ కట్ చేస్తున్న బుచ్చిబాబు

అభ్యర్థులు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, నాయకులు మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాసరావు, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామాన పరమేష్, నాదెళ్ల శ్రీరామ్, ఆళ్ల హరిబాబు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, కంటమణి నారాయణ, తోరం నగేష్, కేవీకే రంగారావు, వైఎంఎస్. మెహెర్, కత్రగడ్డ సురేష్, పొట్రు మురళీకృష్ణ, అర్ధిల్లి రామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, టీవీ రామారావు, దొడ్డిగర్ల సువర్ణరాజు, పోలవరం మాజీ ఎమ్మెల్యే మోడియం శ్రీనివాసరావు పుష్పగుచ్చాలు అందించి సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పెరవలి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం మాజీ అధ్యక్షుడు పసలపూడి భద్రయ్య కొవ్వూరులో అచ్చిబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు అనపర్తి వెంకట నారాయణ (జయ) ఉన్నారు.

హామీలు తుంగలో తొక్కిన జగన్

▸ పోలవరం నిర్వాసితులను మరచిన జగన్

▸ టీడీపీ-జనసేన-బీజేపీ గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి

గోపాలపురం, ఏప్రిల్ 12: పోలవరం కుడి ప్రధాన కాల్వ తాడిపూడి కాల్వలో భూములు కోల్పోయిన రైతాంగానికి అదనపు సొమ్ము ఇచ్చి ఆదుకుంటానని ఇచ్చిన హామీని జగన్ తుంగలో తొక్కాడని కూటమి నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని భీమోలు పరిధిలో తొక్కిరెడ్డిగూడెం, గుడ్డిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. పోలవరం కుడి ప్రధాన కాల్వలో వేలాది ఎకరాలు భూములు కోల్పోయిన రైతులకు రాజశేఖర్‌రెడ్డి అంతంత మాత్రంగా ఇచ్చి చేతులు దులుపుకుంటే, ఒక్కో రైతుకు ఎకరానికి రూ.5 లక్షలు వారి ఖాతాల్లో జమ చేస్తానని గొప్పలు చెప్పుకున్న జగన్.. ఐదేళ్లు గడిచినా ఆ రైతులను గుర్తు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం జగన్ నిర్వాకంతో ఆగిపోయిందని మద్దిపాటి విమర్శించారు.టీడీపీ అధికారంలోకి వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అప్పారావు, జగడాల ఉమానాగేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, నక్కా కిషోర్‌బాబు, శ్రీను, రాము, బెజవాడ మోహన్, కనుమూరి విష్ణురావు, పడమటి నెహ్రూ, అభిమన్యరాజు, ఎంపీటీసీ బొర్రా ఆంజనేయులు పాల్గొన్నారు.



గోపాలపురం: తొక్కిరెడ్డిగూడెంలో మద్దిపాటికి హారతిస్తున్న మహిళ

పల్లి దేవికారాణి, కోటిపల్లి మురళీకృష్ణ పాల్గొన్నారు.

నడిపల్లి, తీపర్రులో ఎన్నికల ప్రచారం

పెరవలి, ఏప్రిల్ 12: టీడీపీ-జనసేన-బీజేపీ ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్‌కు మద్దతుగా మండలంలోని నడిపల్లి, తీపర్రులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అనేక సంక్షేమ పథకాలను వివరించి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. తీపర్రులో కంటిపూడి సూర్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, పత్తిపాటి ప్రసాద్‌కుమార్, నడిపల్లిలో దుర్గేష్ సోదరీలు మీనా కుమారి, సుబ్బాయమ్మ ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పిప్పర రవి, చిట్టూరి వెంకట నారాయణ, కోలా సీతయ్యానాయుడు, కోటి



పెరవలి: తీపర్రులో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు

జగన్ వస్తే ట్రబుల్ ఇంజన్ : ముప్పిడి

కొవ్వూరు, ఏప్రిల్ 12: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం వస్తే జగన్ ట్రబుల్ ఇంజన్ సర్కార్ పోయి, ఎన్డీఏ కూటమి డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జె బ్రాండ్ల పేరుతో మద్యం ద్వారా జగన్‌రెడ్డి లక్ష కోట్లు దోచుకున్నారన్నారు. మద్యపాన నిషేధంపై హామీ ఇచ్చి నేటికీ ఒక్క అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించలేదన్నారు. మద్యం అమ్మకాల్లో లక్షల కోట్లు అవినీతి చేసేందుకే డిజిటల్ పేమెంట్లను పెట్టలేదన్నారు. ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి కనుసన్నల్లోనే మద్యం మాఫియా అరాచకాలు సాగుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులకు మద్యం సరఫరాకు ప్రణాళికలు రచిస్తున్న అతడిని విధుల నుంచి తొలగించాలన్నారు. రాష్ట్రంలో 20ఏళ్ల వరకు మద్య నిషేధం జరగకుండా చేసిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని ముప్పిడి అన్నారు. అలాగే మండలంలోని కాపవరంలో ముప్పిడి వెంకటేశ్వరరావు సతీమణి సుజాత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ప్రజల ఇబ్బందులు తొలగాలంటే ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు.



కొవ్వూరు మండలం కాపవరంలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి ముప్పిడి సతీమణి సుజాత

175 నియోజకవర్గాల్లోనూ బీఎస్పీ పోటీ

▸ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి



సభలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: రాష్ట్రంలో బహుజనుల సమస్యలు రాజ్యాధికారం ద్వారానే పరిష్కారమవుతాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి అన్నారు. రాజమహేంద్రవరం గేదెల నూకరాజు కల్యాణ మండపంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమీక్షించారు. ఒక బీసీగాని, ఎస్సీ గాని ముఖ్యమంత్రి కావాలంటే అది బీఎస్పీ వల్లే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో బీఎస్పీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని చెప్పారు. తొలుత పూలే ,కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు, రాజమహేంద్రవరం , కాకినాడ పార్లమెంట్ అభ్యర్థులు పి.గణేశ్వరరావు, కే.నరసింహమూర్తి, నిడదవోలు,పి.గన్నవరం, అమలాపురం, రాజమహేంద్ర వరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులు గుమ్మాపు చిత్రసేను, కె.సత్యం, యాళ్ల దొరబాబు, కొండపల్లి సూరిబాబు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఎం మోషే తదితరులు పాల్గొన్నారు.

గణితశాస్త్రంలో మూర్తికి పీహెచ్‌డీ

దివాన్‌చెరువు/రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 12: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగంలో పరిశోధన చేసిన రీసెర్చ్ స్కాలర్ డీవీఎస్ఎస్ఆర్ మూర్తికి ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు శుక్రవారం పీహెచ్‌డీ ప్రదానం చేశారు. పరిశోధనా సూపర్‌వైజర్ సీహెచ్ శ్రీనివాసులు పర్యవేక్షణలో కెల్లర్ బాక్స్ పద్ధతి ఉపయోగించి రసాయనిక ప్రతిచర్యలతో వివిధ రకాలైన ఐదు నాన్ న్యూటోనియన్ ఫ్లూయిడ్స్‌పై సంఖ్యాత్మక విశ్లేషణ అనే అంశంపై మూర్తి పరిశోధన చేశారు. కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి టి.హైమావతి, పరిశోధనా సూపర్‌వైజర్ శ్రీనివాసులు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, పరిశోధనాభివృద్ధి విభాగాధిపతి రమణేశ్వరి, ప్రిన్సిపాళ్లు విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాగివస్తువులు, చీరలు పట్టివేత

కడియం, ఏప్రిల్ 12: కడియం మండలం పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద సీఐ బి.తులసీధర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్లులు లేకుండా తీసుకెళుతున్న రూ.71,000 విలువైన రాగివస్తువులు, రూ.1,19,000 విలువైన 140 చీరలను పట్టుకున్నారు. వాటిని ఎఫ్ఎస్‌టీ టీమ్‌కు అప్పగించినట్టు చెప్పారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

గోకవరం, ఏప్రిల్ 12: ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ కె.నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి, రంపయర్రంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు ధైర్యంగా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

కడియం, ఏప్రిల్ 12: మండలంలోని వీరవరంలో శుక్రవారం ఓటు హక్కుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాధాన్యం, దాని వినియోగంపై అవగాహనా కలిగించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళలతో ర్యాలీ జరిపారు. ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం బి.అప్పలకొండ, కమ్యూనిటీ కోఆర్డినేటర్ డీవీ సింహాచలం, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులు సమాయత్తం కావాలి : నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 12: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అనపర్తి, పొలమూరు, మహేంద్రవాడ గ్రామాల్లో బూత్‌కమిటీ ప్రతినిధులు, పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. సమయం తక్కువగా ఉన్నందున ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మామిడిశెట్టి శ్రీను, కర్రి వెంకటరెడ్డి, జుత్తుగ కృష్ణ పాల్గొన్నారు.

శ్రీ మద్భగవద్గీత భక్తి యాగం

కొవ్వూరు, ఏప్రిల్ 12: అవివేకంతో చేసే అభ్యాసన కంటే విచక్షణా జ్ఞానమే గొప్పదని తిరుపతి వశిష్టాశ్రమ పీఠాధిపతి సస్వరూపానందగిరి స్వామిజీ అన్నారు. కొవ్వూరు ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ క్లబ్‌లో శ్రీ మద్భగవద్గీత భక్తి యాగంలో ఆయన పాల్గొని శుక్రవారం భగవద్గీత ప్రవచనం అందించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళాశాల వార్షిక, స్పోర్ట్స్ డే

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 12 : రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వార్షిక, స్పోర్ట్స్ డేను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్రాంక్లిన్ టెక్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.శివకుమార్ మాట్లాడారు. భవిష్యత్తును ఆనందమయంగా మలచుకోవడానికి శ్రమపడాలి, కష్టపడాలి అన్నారు.స్పోర్ట్స్ విభాగంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు, అలూమ్ని అధ్యక్షుడు సీరా గంగాధరరావు, కార్యదర్శి అర్మస్, మాటూరి సిద్ధార్థ, పీఏ కిషోర్‌బాబు, జి.వెంకటరమణ, అధ్యాపకులు స్వర్ణశ్రీ, డీవీ రమణమూర్తి, శరత్‌బాబు పాల్గొన్నారు.

రంగంపేట భవిత కేంద్రం రాష్ట్రంలో ప్రథమం

రాష్ట్ర అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ రాధిక

రంగంపేట, ఏప్రిల్, 12: ప్రత్యేక అవసరాల పిల్లలను తీర్చిదిద్దడంలో రంగంపేట భవిత కేంద్రం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని రాష్ట్ర అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ ఎస్.రాధిక అన్నారు. శుక్రవారం రంగంపేటలోని భవిత కేంద్రాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. టీఎల్ఎం కిట్లు, ట్యాబ్‌ల వినియోగంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని ఆమె అభినందించారు. విద్యార్థుల నమోదు, హాజరు నిలకడలో కృషి చేస్తున్న కేంద్ర నిర్వాహకులు, ఐఈఆర్టీలు ఎంవీఎస్ ప్రసాద్, జి.అంజి కృషిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా రికార్డులు విద్యాబోధన ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. శారీరక వికాసానికి, మానసిక ఆరోగ్యానికి ఒక రోజు ఫిజియో థెరపీ ద్వారా వైద్యుని సూచనలు తల్లిదండ్రులకు, విద్యార్థులకు తెలిపి చైతన్యపరచడంలోనూ, పదో తరగతి, ఇంటర్, టీచర్ ట్రైనింగ్ కోర్సులకు ఈ కేంద్ర విద్యార్థులు వెళ్లడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష ఐఈ కో ఆర్డినేటర్ ఎస్.కన్నబాబు, ఎంఈవో పి.మధుసూదనరావు, సీఆర్ఎంటి ఎల్.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వెబ్‌నార్

రాజమహేంద్రవరంకల్చరల్, ఏప్రిల్ 13 : శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం బయోలాజికల్ సైన్స్ ఫర్ ద వెల్ఫేర్ ఆఫ్ మ్యాన్‌కైండ్ పై జాతీయ స్థాయి వెబ్‌నార్‌ను జంతు శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో నిర్వహించా రు. కళాశాల ప్రిన్స్‌పాల్ పి.రాఘవ కుమారి వెబ్‌నార్‌ను ప్రారం భించి ముఖ్య అంశాలను తెలిపారు.ఈ కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాధిపతి ప్రియాంక, అధ్యాపకులు జి.దివ్యశ్రీ, దీపికారాణి, ఎం.కాస్మలను అభినందించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 12: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థు లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జనసేన పార్టీ నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి అభ్యర్థించారు. ఈ మేరకు దివాన్‌చెరువులోని నీలంతోటలో ఇం టింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు దేశాల శ్రీను, వంక మల్లిబాబు, అక్కిరెడ్డి వేణు, యర్రంశెట్టి శ్రీను, గంగి బ్రహ్మరాజు, దాసరి శ్రీను పాల్గొన్నారు. అలాగే పాలచర్లలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగిశెట్టి చంటి బాబు, జనసేన నాయకులు సూరపురెడ్డి రాజారావు, గంగిశెట్టి రాజేంద్ర తదితరులు ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్1	లవ్‌గురు
వై.స్ర్కీన్2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	డీజే టిల్లు-2
రాధాకృష్ణ	ఫ్యామిలీ స్టార్
శ్రీగణపతి	గీతాంజలి మళ్లీ వచ్చింది

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్ర్కీన్1	భీమా
స్ర్కీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి